PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupati, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 39 | విజయవాడ, సోమవారం 9 సెప్టెంబర్ 2024 | 6 + 8 పేజీలు : 5.50

Vol No | Vijayawada, Monday 9 September 2024 | Rs

బాధితులకు ఆపన్నహస్తం

- సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఆహారం, మందులు పంపిణీ
- పారిశుధ్య పనుల్లోనూ సాయం

2

నవదీప్ పసిడి త్రో

- జావెలిన్ త్రోలో బంగారు పతకం
- 200మీ రేసులో సిమ్రన్‌కు కాంస్యం
- పారిస్ 2024 పారాలింపిక్స్

6

బుడమేరు

గండ్లు పూడ్చివేత

కేసరపల్లి వద్ద మరో గండి

- ఇంకా అడుగులోతు నీటిలోనే పల్లపు ప్రాంతాలు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి, విజయవాడ, ఇబ్రహీంపట్నం, గన్నవరం

ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి శాంతినగర్-కవులూరు వద్ద బుడమేరుకు పడిన మూడు గండ్లను ఎట్టకేలకు పూడ్చి వేశారు. రెండు గండ్లను నాలుగు రోజుల క్రితమే పూడ్చి వేసిన అధికారులు.... మూడో గండి పూడ్చివేతను శనివారం మధ్యాహ్నానికి పూర్తి చేశారు. ఈ గండ్లను సంప్రదాయ పద్ధతిలోనే పూడ్చి వేశారు. అయితే, విజయవాడ దిగువన కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి వద్ద ఆదివారం బుడమేరుకు మరో భారీ గండిపడింది. బుడమేరులో కారుతో సహా కొట్టుకుపోయిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గల్లంతయ్యారు. మొదటి రెండు గండ్ల పూడ్చివేతకు దాదాపు 50 వేల టన్నుల మెటీరియల్ వినియోగించారు. బుడమేరు కరకట్ట పనులు ఇంకా కొనసాగుతున్నాయి. వరద మరింత పెరగకుండా ఉండేందుకు కరకట్టను మరో నాలుగు అడుగులు ఎత్తు పెంచేందుకు రెండో లేయర్ పనులను యుద్ధప్రాతిపదికన కొనసాగిస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో శనివారం నుండి కురుస్తున్న వర్షాలతో బుడమేరులో ఇంకా మూడడుగుల మేర సుమారు మూడు వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. గండ్లు పూడ్చివేత పనులను ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు రేయింబవళ్లు దగ్గరుండి పర్యవేక్షించారు. కరకట్ట పటిష్టత పనులను కూడా ఆయన పర్యవేక్షిస్తున్నారు. ఆర్మీ, ఎన్‌డిఆర్‌ఎఫ్ అధికారులు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

తగ్గిన వరద ఉధృతి

బుడమేరు ప్రధాన గండ్ల పూడ్చివేతతో ముంపు ప్రాంతాల్లో వరద నీరు తగ్గింది. ముంపు నుండి కొద్దిగా తేరుకుంటున్నారు. పునరావాస కేంద్రాలు, బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో తలదాచుకున్నవారు తమ ఇళ్లకు తిరిగి వెళ్తున్నారు. అయితే, శనివారం నుండి కురుస్తున్న వర్షాలతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి మంత్రి లోకేష్ సహాయ చర్యలను పర్యవేక్షిస్తున్నారు.

ఎన్‌టిఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి శాంతినగర్ - కవులూరు వద్ద పడిన మూడో గండిని పూడ్చివేసిన దృశ్యం

వరద నీటిలోనే.. పల్లపు ప్రాంతాలు

అజిత్‌సింగ్ నగర్, పాయకాపురంలోని శాంతి నగర్, ప్రకాష్ నగర్, వాంబే కాలనీ, ఎల్‌బిఎస్ నగర్ తదితర ప్రాంతాల్లోని పల్లపు ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు ఇంకా నిల్చే ఉంది. అత్యధిక మంది ఇళ్లల్లో ఇంకా వంట చేసుకునే పరిస్థితి లేదు. రేషన్ సరుకులు అత్యధిక చోట్ల ఇంకా పంపిణీ జరగలేదు. అనేకమందికి ఈ నెల అందాల్సిన సామాజిక పింఛను అందలేదు. వ్యక్తిగత రవాణా వాహనాలకు కొంత వెసులుబాటు వచ్చినా ప్రజా రవాణా వాహనాలు అందుబాటులోకి రాలేదు.

2 వేల ఎకరాల్లో పంటలు మునక

ఏలూరు కాల్వకు భారీ గండిపడడంతో రెండు వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. జగనన్న కాలనీ నీటిలో తేలియాడుతోంది. మచిలీపట్నం మండలం హుస్సేన్‌పాలెం గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కలిదిండి ఫణికృష్ణ (40) హైదరాబాద్ నుండి కారులో గన్నవరం-కంకిపాడు ప్రధాన రహదారిలో వస్తుండగా పొంగిపొర్లుతున్న బుడమేరులో కారుతో సహా కొట్టుకుపోయి గల్లంతయ్యారు. ఆయన కోసం పోలీసు, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి.

'ఆపరేషన్ బుడమేరు' అమలుకు పటిష్ట చట్టం

- ముఖ్యమంత్రి చంద్రబాబు

2

వరద నష్టంపై గవర్నర్‌కు నివేదిస్తున్న సిఎం చంద్రబాబు

నేటి నుంచి 3 రోజులు ఎన్యూమరేషన్

- నష్టం ప్రాథమిక అంచనా రూ.6,882 కోట్లు
- ఆర్‌పి సిసోడియా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ నగరంలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో నష్టాన్ని అంచనా వేసేందుకు ఈ నెల 9 నుంచి 11 వరకు (మూడు రోజులు) ఎన్యూమరేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా పేర్కొన్నారు. వరదల వల్ల రూ.6,882 కోట్లు నష్టం వాటిల్లి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 1,400 మంది ఎన్యూమరేషన్ సిబ్బందికి ఆదివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సిసోడియా మట్లాడుతూ.. నగరంలోని 32 వార్డుల్లో 149 సచివాలయాల పరిధిలో 2 లక్షలకు పైగా నివాసాల్లో నష్టం గణన చేయనున్నట్లు తెలిపారు. విజయవాడ రూరల్ మండలంలోని ఐదు గ్రామాల్లో పూర్తి స్థాయి నష్టం జరిగిందన్నారు. వరద నష్టం అంచనాల్లో 149 మంది తహశీల్దార్ల సేవలు వినియోగించు కుంటున్నామన్నారు. గణనలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా ఉండేందుకు ప్రతి వార్డుకూ ఒక జిల్లా స్థాయి అధికారి నేతృత్వం వహిస్తూ ర్యాండమ్‌గా తనిఖీలు చేపడతార న్నారు. ప్రతి రెండు వార్డులకు ఒక ఐఎఎస్ అధికారి పర్యవేక్షిస్తారని సిసోడియా తెలిపారు. ఒక వార్డు లేదా గ్రామ సచివాలయానికి 10 గణన బృందాలు ఇంటింటికీ సర్వే నిర్వహించి అవసరమైన సమాచారాన్ని సేకరిస్తారన్నారు. కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ నష్టం గణన కోసం 200 బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మొత్తం సమాచారాన్ని బాధితుల సమక్షంలోనే ప్రత్యేకంగా రూపొందించిన యాప్ లో నిక్షిప్తం చేస్తారన్నారు. అదనపు సిసిఎల్ఎ ఎ ప్రభాకర్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తారన్నారు. పునరావాసం కోసం రూ.750 కోట్లు వ్యయం అవుతాయని అంచనాలు ఉన్నాయన్నారు.

విశాఖలో కొండచరియలు విరిగిపడ్డ ప్రాంతమిదే..

ఉత్తరాంధ్రలో కుండపోత

- లోతట్టు ప్రాంతాల్లో చేరిన వర్షపు నీరు
- పొంగి ప్రవహిస్తున్న నదులు, వాగులు, వంకలు
- పలు గ్రామాలకు నిల్చిన రాకపోకలు
- విశాఖలో విరిగిపడిన కొండచరియలు

ప్రజాశక్తి- యంత్రాంగం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలుచోట్ల ఆదివారం కుండపోత వర్షాలు కురిశాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనూ వర్షాలు కురిశాయి. కొన్ని చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు పడ్డాయి. ఎడతెరిపి లేకుండా వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లడంతో పలుచోట్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పంట పొలాలు నీటమునిగాయి. శ్రీకాకుళం జిల్లాలో వృద్ధురాలు గల్లంతయ్యారు. పోలాకి మండలం ముప్పిడి గ్రామానికి చెందిన డొంకాన లక్ష్మీదేవి (80) వంశధార కాలువలో ప్రమాదవశాత్తు కాలు జారి పడ్డారు. వంశధార, నాగావళి, మహేంద్రతనయ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లావేరు మండలంలోని బుడుమూరు పెద్దగెడ్డ పొంగి ప్రవహిస్తుండడంతో సుమారు 12 గ్రామాల ప్రజలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. రణస్థలం మండలంలోనిబుచ్చవాని గెడ్డ పొంగిపొర్లడంతో సుమారు 40 గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మహేంద్రతనయ ఉధృతితో పాతపట్నం సమీపంలోని కాజ్‌వేపై నుంచి వరద నీరు ప్రవహించింది. దీంతో, కె.గోపాలపురం, హెచ్.గోపాలపురం గ్రామాలకు పాతపట్నం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి.

విశాఖలో విరిగిపడిన కొండచరియలు

కుండపోత వర్షాలకు విశాఖ నగరంలోని గోపాలపట్నం సమీపాన ఉన్న రామకృష్ణ నగర్ కాళీమాత అమ్మవారి ఆలయ మార్గంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఎడతెరిపిలేని భారీ వర్షాల నేపథ్యంలో విశాఖలోని ఆరిలోవ, గోపాలపట్నం, విశాలాక్షి నగర్, కైలాసగిరి, గాజువాక, పెందుర్తి, వేపగుంట,

మిగతా 5లో

రెండు భాగాలుగా విడిపోయిన మగధ్ ఎక్స్‌ప్రెస్

- తప్పిన పెను ముప్పు

రెండు భాగాలుగా విడిపోయిన మగధ్ ఎక్స్‌ప్రెస్, ఇన్‌సెట్‌లో విరిగిపోయిన కప్లింగ్

పాట్నా : బీహార్‌లోని బక్సర్ జిల్లాలో మగధ్ ఎక్స్‌ప్రెస్‌కు పెను ప్రమాదం తప్పింది. తూర్పు మధ్య రైల్వే (ఇసిఆర్)లోని దానాపూర్ డివిజన్ పరిధిలో ఆదివారం ఉదయం 11.08 గంటలకు కప్లింగ్ విరిగిపోవడంతో మగధ్ ఎక్స్‌ప్రెస్ రెండు ముక్కలుగా విడిపో యింది. దీంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళనకు గుర య్యారు. లోకోపైలెట్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. మగధ్ ఎక్స్‌ప్రెస్ (20802) న్యూఢిల్లీ నుండి ఇస్లాంపూర్‌కు వెళ్తుండగా దానాపూర్ డివిజన్‌లో ట్వినిగంజ్- రఘునాథ్‌పూర్ రైల్వే స్టేషన్ల మధ్య 13, 14 కంపార్ట్‌మెంట్స్ అయిన ఎస్ - 7, ఎస్- 6 కోచ్‌ల మధ్య మధ్య కప్లింగ్ విరిగిపోయింది. దీంతో రైలు ఒక్కసారిగా భారీ కుదుపునకు లోనై, రెండు భాగాలుగా విడిపోయిందని, అయితే ప్రాణనష్టం ఏమీ లేదని చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (సిపిఆర్ఒ) తెలిపారు. రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ (ఆర్‌పిఎఫ్) బృందం ఘటనా స్థలానికి చేరుకుని మరమ్మతులు చేపట్టాక రైలు తిరిగి బయల్దేరిందని తెలిపారు. కొద్ది సేపు ఈ మార్గంలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడింది. ఈ ఘటనపై దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు తెలిపారు.

45కు చేరిన మృతుల సంఖ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

భారీ వర్షాలు, వరదల వల్ల మృతుల సంఖ్య 45కు చేరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్‌టిఆర్ జిల్లాలో 35 మంది మరణించారని తెలిపింది. విజయవాడ ఉత్తర మండలంలో 10 మంది, రూరల్‌లో 8 మంది, జి కొండూరు మండలంలో నలుగురు, మైలవరం, ఇబ్రహీంపట్నం మండలాల్లో ఇద్దరు చొప్పున, కంచికచర్ల, రెడ్డి గూడెం, విజయవాడ సెంట్రల్, వెస్ట్ మండలాల్లో ఒక్కొక్కరు చొప్పున మరణించారు. గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలంలో ఐదుగురు, మంగళగిరి పట్టణం, పొన్నెకల్లులో ఒక్కరు చొప్పున మరణించారు. పల్నాడు జిల్లాలో ఒకరు, ఏలూరు జిల్లాలో ఇద్దరు మరణించారు. మొత్తం 6,44,133 మంది వరద బాధితులయ్యారని ప్రభుత్వం ప్రకటించింది. 48,528 మందిని 246 పునారావాస కేంద్రాలకు తరలించినట్లు తెలిపింది. 20 జిల్లాల్లో 1,81,538 హెక్టార్లలో పంట దెబ్బతినడం వల్ల 2,05,194 మంది రైతులు నష్టపోయారని పేర్కొంది. 12 జిల్లాల్లోని 19,686 హెక్టార్లలో హార్టికల్చర్ పంట దెబ్బతినడం వల్ల 30,877 మంది రైతులు నష్టపోయారని తెలిపింది.

బిజెపిని గద్దెదించాలి

- హర్యానా ప్రజలకు కిసాన్, మజ్దూర్ మహా పంచాయత్ పిలుపు
- 17న గ్రామాలు, పట్టణాల్లో కిసాన్, మజ్దూర్ సభలు
- 28న భగత్ సింగ్ జయంతి

హిసార్ కిసాన్, మజ్దూర్ మహాపంచాయత్‌లో మాట్లాడుతున్న సిఐటియు నేత ఎఆర్ సింధు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక బిజెపిని గద్దె దించాలని హర్యానా ప్రజలకు కిసాన్, మజ్దూర్ మహా పంచాయత్ పిలుపునిచ్చింది. సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం), సెంట్రల్ ట్రేడ్ యూనియన్ల ఉమ్మడి వేదిక (సిటియు) కలసికట్టుగా కార్మిక-రైతు మహాపంచాయత్‌ను హర్యానాలోని హిసార్ రైతు మార్కెట్ ప్రాంగణంలో నిర్వహించారు. మరో నాలుగు వారాల్లో జరగనున్న హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి గట్టిగా బుద్ధి చెప్పాలని మహాపంచాయత్ పిలుపునిచ్చింది. ఈ మేరకు ఒక తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది. హర్యానా రాష్ట్ర రైతులు, కార్మికులు, ఉద్యోగ సంఘాల నేతలు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ మహాపంచాయత్‌నుద్దేశించి ప్రసంగించినవారిలో జోగేంద్ర సింగ్ ఉగ్రహన్ పి కృష్ణప్రసాద్, రాజన్ క్షీరసాగర్,(ఎస్‌కెఎం), ఎఆర్ సింధు (సిఐటియు) ఉన్నారు. బిజెపి నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ సర్కార్ గత అయిదేళ్లలో రైతులు, కార్మికులపై సాగించిన దారుణ అణచివేతను మహా పంచాయత్ ఖండించింది. బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని కార్పొరేటీకరించడానికి మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చినప్పుడు రైతులు ఏడాది పాటు వీరోచితంగా పోరాడి వాటిని తిప్పికొట్టారు. అలాగే కార్మికులను బానిసలుగా మార్చే దుర్మార్గమైన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించాలని, స్వాతంత్ర్యానంతర భారత చరిత్రలోనే గరిష్ట స్థాయికి చేరిన నిరుద్యోగం, ధరల పెరుగుదల, సామాన్యుల జీవనోపాధిపై ఎడాపెడా జరుగుతున్న దాడులను తిప్పికొట్టేందుకు పోరాటాల ను మరింత ఉధృతం చేయాలని నిర్ణయించింది.

రైతులు, అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు,

మిగతా 5లో

కొబ్బరి రైతుకు దక్కని ధర

- వ్యాపారుల మాయాజాలం
- ఆందోళనలో కోనసీమ రైతులు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రస్తుతం కొబ్బరి ధర మెరుగ్గా ఉన్నా ఈ ఫలితం రైతుకు దక్కడం లేదు. మార్కెట్లో పెరిగిన ధర దళారుల సొంతమవుతోంది. రైతుల వద్ద నిల్వలు అయిపోయిన నెల రోజులకు ధరలు పెరిగాయి. ప్రస్తుతం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మార్కెట్లో వెయ్యి నీటి కాయల ధర రూ.12 వేలకు చేరింది. గత నెలలో ఈ ధర రూ.8 వేలకే పరిమితమైంది. గత వారంలో రూ.10 వేలు ఉంది. ప్రస్తుతం వినాయక చవితి ఉత్సవాలు కొనసాగుతుండడం, అక్టోబరులో దసరా, దీపావళి పండగలు ఉండడం, అనంతరం కార్తీకమాసం నేపథ్యంలో డిమాండ్ పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. నాఫెడ్ కేంద్రాల ద్వారా జులై మొదటి వారంలో కొబ్బరి కొనుగోలు ప్రారంభమైంది. ఏప్రిల్ నెల నుంచి జూన్ వరకూ కొబ్బరి రైతులు కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు ఎదురు చూశారు. జులైలో కొనుగోలు ప్రారంభించినా స్థానికంగా ఉన్న ఎండు కొబ్బరిని కొనుగోలు చేయకుండా కేరళ, తమిళనాడు నుంచి వ్యాపారులు తెచ్చిన కొబ్బరినే కొనుగోలు చేశారు. దీంతో, కోనసీమ కొబ్బరికి ధర రాలేదు. ఈ పరిస్థితి చూసిన రైతులు కొబ్బరిని ఆగస్టులోనే వ్యాపారులకు విక్రయించారు. తాజాగా కొబ్బరి వ్యాపారుల వద్దకు చేరిన తరువాత ధరలు పెరిగాయి. మరో దింపు వచ్చే వరకైనా ఈ ధర ఉంటే రైతులకు కొంత ఊరట లభించే అవకాశం ఉందని, ప్రభుత్వం ఆ దిశగా చొరవ తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కొబ్బరిని వలుస్తున్న కార్మికులు

1.10 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో 1.10 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. ఏటా జిల్లాలో వంద కోట్లకుపైగా కొబ్బరి కాయల దిగుబడి వస్తుందని అంచనా. ఇక్కడి నుంచి తెలంగాణ, తమిళనాడు, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, బీహార్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు కొబ్బరిని ఎక్కువగా ఎగుమతి చేస్తున్నారు. అంబాజీపేట మార్కెట్ నుంచి ప్రతి రోజూ 120 నుంచి 150 లారీల ఎగుమతులు జరిగేవి. ప్రస్తుతం ధర ఉన్నా 60 నుంచి 80 లారీల కొబ్బరి మాత్రమే ఎగుమతి అవుతోంది. కొన్నేళ్లుగా కొబ్బరి సాగులో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న రైతులు నిలకడలేని ధరలతో నిరాశ చెందుతున్నారు. మరోపక్క కొబ్బరి చెట్లకు ఎర్రనల్లి, తెల్లదోమ, ఆకుతేలు, ఎండాకు తెగులు సోకుతున్నాయి. దీంతో, ఆకులు ఎండిపోయి చెట్లు జీవం కోల్పోతున్నాయి. పూతకు వచ్చిన గెలల్లో కాయలు తొలిదశలోనే రాలిపోతున్నాయి. ఇది దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఎకరాకు ప్రస్తుతం 500 కాయల దిగుబడి మాత్రమే వస్తోంది. సాధారణంగా 900 నుంచి 1000 కాయలు దిగుబడి రావాలి. దిగుబడులు పడిపోవడం కూడా మార్కెట్లో డిమాండ్ పెరుగుదలకు కారణమని చెబుతున్నారు.

బందీలను విడిపించాలని, కాల్పుల విరమణ పాటించాలని డిమాండ్ చేస్తూ టెల్ అవీవ్‌లోని కిర్యా సమీపంలో ఆందోళన చేస్తున్న ఇజ్రాయిలీలు (వార్త 5లో)

జన'గణన' స్టాండింగ్ కమిటీ రద్దు

న్యూఢిల్లీ : ప్రతి సమావేశంలోనూ జనగణనలో జాప్యాన్ని ప్రశ్నిస్తున్నందుకు ప్రముఖ ఆర్థికవేత్త ప్రణబ్ సేన్ నేతృత్వంలోని 14 మంది సభ్యుల స్టాండింగ్ కమిటీ ఆన్ స్టాటిస్టిక్స్ (ఎస్‌సిఒఎస్)ను కేంద్రప్రభుత్వం రద్దు చేసింది. ఈ విషయాన్ని కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ గీతాసింగ్ రాథోడ్ సభ్యులకు ఇమెయిల్ ద్వారా తెలిపారు. కమిటీని రద్దు చేయడానికి ఎలాంటి కారణాన్ని తెలపలేదని ప్రణబ్ సేన్ మీడియాకు తెలిపారు. తాము ప్రతి సమావేశంలోనూ జనగణన ఇంకా నిర్వహించక పోవడాన్ని ప్రశ్నిస్తున్నామని చెప్పారు. ఇది డేటా సేకరణకు ఎంతో ముఖ్యమైనదని గుర్తు చేస్తున్నామని తెలిపారు. 'దేశ విధానాలను శాస్త్రీయంగా నిర్ణయించడానికి జనాభా గణన ఒక ముఖ్యమైన సాధనం. ఇందులో జరుగుతున్న జాప్యాన్ని ప్రశ్నించాం. బహుశా కమిటీ రద్దు చేయబడటానికి ఇదే కారణం కావచ్చు' అని పేరు చెప్పడానికి ఇష్టపడని సభ్యులు ఒకరు పేర్కొన్నారు. 2021లో నిర్వహించాల్సిన జన గణనను కేంద్రం ఇంకా ప్రారంభించని విషయం తెలిసిందే.

కోస్తాంధ్రలో నేడు భారీ వర్షాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కోస్తాంధ్రలో సోమవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం రానున్న 24 గంటల్లో తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని తెలిపింది. ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా, శ్రీకాకుళం, విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో ఈ వర్షాలు ఉంటాయని పేర్కొంది. గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలు వీచే అవకాశం ఉందని తెలిపింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

లారీ ఢీకొని 11 మంది మున్సిపల్ కార్మికులకు గాయాలు

ప్రజాశక్తి - విజయవాడ : విధినిర్వహణలో భాగంగా ఆదివారం విజయవాడ రాణిగారి తోట నుంచి ప్రభుత్వాస్పత్రి సమీపంలోని మస్టర్ పాయింట్ వద్దకు ఆటోలో వెళుతున్న మున్సిపల్ కార్మికులను లారీ ఢీకొంది. లారీ వెనుక నుండి ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న 11 మంది మున్సిపల్ కార్మికులకు, ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి.

వీరిలో ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో డి.కోటమ్మ, ఎం.దుర్గ అనే ఇద్దరితోపాటు ఆరుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన ఐదుగురు కార్మికులకు, ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర క్షతగ్రాతులను గురించి ఫోన్లో ఆరా తీసి మెరుగైన చికిత్స అందించాలని ఆస్పత్రి స్టిబందిని కోరారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతల పరామర్శ

క్షతగాత్రులను మున్సిపల్ వర్కర్స్ గౌరవ అధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ తదితరులు పరామర్శించారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

గుంటూరు జిల్లా పొన్నూరు మండలం తంగెళ్ళమూడిలో నీట మునిగిన వరి

లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్న జిల్లా కలెక్టర్ వెంకట మురళి

కోలుకోని లంక గ్రామాలు

- వరదలతో రైతులకు అపార నష్టం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా, గుంటూరు జిల్లా ప్రతినిధి

కృష్ణానదికి మళ్లీ వరద ఉధృతి పెరగడంతో లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వరద ముంపు హెచ్చరికల నేపథ్యంలో లంకగ్రామాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సూచించారు. కృష్ణానదికి రికార్డు స్థాయిలో వరద ప్రవాహం రావడంతో బాపట్ల జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు మండలాలలోని 22 గ్రామాలు ముంపుకు గురయ్యాయి. జిల్లాలోని 86 వేల ఎకరాల్లో వ్యవసాయ పంటలకు తీవ్ర-నష్టం వాటిల్లింది. వరి, అరటి, పసుపు. కంద, కూరగాయల తోటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఎకరానికి రూ.50 నుంచి రూ. 60 వేల కౌలు చెల్లించి పంటల సాగు చేశారు. వరదల నాటికి కంద సాగుకు రూ.2.50 లక్షలు, తమలపాకుల తోటల సాగుకు రూ. లక్ష, పసుపు సాగుకు రూ.70 వేలు, అరటికి రూ.50 వేలు చొప్పున కౌలు రైతులు పెట్టుబడి పెట్టారు. వరదల కారణంగా అన్ని పంటలు తుడిచి పెట్టుకుపోయాయి. కౌలు రైతులు అత్యధిక మందికి గుర్తింపు కార్డులు లేవు.

వరద నీటి ఉధృతి కారణంగా బాపట్ల జిల్లా వైపు కృష్ణానది కరకట్టలు కొన్ని చోట్ల బలహీనపడ్డాయి. వరదలు, మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా లంక గ్రామాలతో పాటు, జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ప్రధానంగా లంక గ్రామాల నుంచి మురుగునీరు బయటకు వెళ్ళే పరిస్థితి లేదు. మురుగు అంతా అక్కడే ఉండిపోతుంది. లోతట్టు ప్రాంతాలు, కుంటలు అన్ని మురుగుతో నిండిపోయాయి.

గుంటూరు జిల్లాలో వరి, పత్తి , మిర్చి, జొన పంటలు గత వారం రోజులుగా నీటిలోనే ఉండిపోయాయి. పంట నష్టం అంచనావేయడానికి కూడా వీలు లేకుండా నీటిలో నానుతున్నాయి. తెనాలి, దుగ్గిరాల, మంగళగిరి, తాడేపల్లి, తాడికొండ, వట్టిచేరకూరు పెదనందిపాడు, పత్తిపాడు, చేబ్రోలు, కొల్లిపర, కాకుమాను తదితర మండలాల్లో వరి, పత్తి, మిర్చి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. పల్నాడు జిల్లాలోని దాచేపల్లి, అచ్చంపేట, అమరావతి క్రోసూరు, బెల్లంకొండ, మాచవరం తదితర మండలాల్లో పంటలకు అపార నష్టం వాటిల్లింది. పసుపు, అరటి, కంద, మునగ, బొప్పాయి, దొండ, తమలపాకు, కూరగాయల తోటలు, పూల తోటలు నీటమునిగాయి.

ఉద్యాన పంటలకు ఇప్పటికే ఎకరాకు రూ. 30,000 నుంచి 40 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టారు. ప్రాథమిక అంచనాల ప్రకారం గుంటూరు జిల్లాలో 70 వేల ఎకరాల్లో వరి, పది వేల ఎకరాల్లో పత్తి, 30 వేల ఎకరాలలో ఉద్యాన పంటలు పూర్తిగా నీట మునిగాయి. పల్నాడు జిల్లాలో 37 వేల ఎకరాలలో పత్తి, మూడు వేల ఎకరాల్లో వరి, నాలుగు వేల ఎకరాల్లో మిర్చి, ఎనిమిది వేల ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. దాచేపల్లి, అచ్చంపేట, అమరావతి, తుళ్లూరు, తాడేపల్లి, కొల్లిపర, దుగ్గిరాల తదితర మండలాల్లోని లంక భూముల్లో వరద నీరు చేరడంతో పంటలన్నీ దెబ్బతిన్నాయి.

'ఆపరేషన్ బుడమేరు' అమలుకు పటిష్ట చట్టం

- ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆపరేషన్ బుడమేరును ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు. ఇందుకోసం పటిష్ట చట్టాన్ని తీసుకురానున్నట్లు తెలిపారు. విజయవాడలోని కలెక్టరేట్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ల్యాండ్ గ్రాబర్స్, పొలిటికల్ సపోర్టుతో ఆక్రమణలకు పాల్పడ్డ వారికి బుద్ధి చెప్పే పటిష్టమైన చట్టం ఉంటుందన్నారు. కొంత మంది ఆక్రమణదారుల వల్ల లక్షలాది మంది ఇబ్బంది పడుతుంటే చూస్తూ ఊరుకోబోమని ఆయన స్పష్టం చేశారు. ఇటువంటి వరదలు విజయవాడ పట్టణానికి మళ్లీ రాకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. భారీ వర్ష సూచన ఉన్న నేపథ్యంలో అన్ని జిల్లాల్లో యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని తెలిపారు. బుడమేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

గవర్నరుతో సిఎం భేటీ

గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్‌తో సిఎం చంద్రబాబు భేటీ అయ్యారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, బుడమేరుతో సంభవించిన వరదలు, సహాయక చర్యలతోపాటు రాష్ట్రానికి జరిగిన నష్టం సుమారు రూ.6,880 కోట్లు ఉండొచ్చని కేంద్రానికి నివేదిక పంపినట్లు గవర్నరుకు సిఎం వివరించారు. వీరిద్దరి భేటీ 45 నిమిషాలకు పైగా జరిగింది. వరద బాధితులను ఆదుకునేందుకు అధికార యంత్రాంగమంతా రేయింబవళ్లు పనిచేసి పెద్దయెత్తున సహాయక పునరావాస చర్యలు చేపట్టినట్లు సిఎం తెలిపారు.

సిఎం చంద్రబాబు శనివారం రాత్రి మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ చర్యలను ఆర్మీ ఇంజినీరింగ్ విభాగం ప్రశంసించిందన్నారు. బుడమేరు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. నాలుగు రోజులుగా మంత్రులు నిమ్మల రామానాయుడు, నారా లోకేష్ అక్కడే ఉండి ప్రత్యేకంగా దృష్టి సారించి, బుడమేరు గండ్లను పూడ్చే పనిని పూర్తి చేయగలిగారన్నారు. సోమవారం అనేక జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను సిఎం ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్లతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏలేరు రిజర్వాయర్‌కు ఎక్కువ వరద వచ్చే అవకాశం ఉందని, ప్రాజెక్టు స్టోరేజీ కెపాసిటీని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలన్నారు. వరద, భారీ వర్షాలపై ప్రజల ఫోన్లకు అలర్ట్ మెసేజ్‌లు పంపాలని, ముంపు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షితంగా ప్రత్యేక శిబిరాలకు తరలించాలని ఆదేశించారు.

నేటి నుంచి ఇంటింటి ఆరోగ్య సర్వే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో వ్యాధుల వ్యాప్తిపై ఈ నెల 9 నుంచి 12 వరకు (నాలుగు రోజులు) వైద్యారోగ్యశాఖ ఇంటింటి సర్వే నిర్వహించనుంది. ఈ సర్వే నిర్వహణకు 150 వైద్య బృందాలను నియమించినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం వెల్లడించారు. ప్రతి బృందంలో ముగ్గురు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఒక ఎఎన్ఎం ఉంటారని, ముంపునకు గురైన 32 డివిజన్లలో ఈ సర్వే నిర్వహించనున్నారు. 32 వార్డుల్లోని 149 వార్డు సచివాలయ కేంద్రాలకు సంబంధించి ప్రతి సిహెచ్ఒ 300 నుంచి 400 కుటుంబాల్లోని సభ్యుల ఆరోగ్య వివరాలను సేకరిస్తారు. దగ్గు, జలుబు, జ్వరం, బిపి, మధుమేహం, చర్మ వ్యాధులు, పాము, తేలు కాట్లు గాయాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తారు. ఇప్పటి వరకు ఆరోగ్యశాఖ అందజేసిన లక్షకు పైగా అత్యవసర మందుల కిట్లు లభ్యత, మందుల లభ్యత అవసరాలకు సంబంధించిన సమాచారాన్ని సిహెచ్‌ఒలు సర్వే కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో పొందుపరుస్తారు. కుటుంబ సభ్యులు అందించిన సమాచారం మేరకు వ్యాధి తీవ్రతను బట్టి సమీపంలోని ప్రభుత్వాస్పత్రులకు పంపుతారు. కిట్లలో లేని ప్రత్యేక మందులు ఏమైనా అవసరమైతే వాటిని మరుసటి రోజు ఆయా సచివాలయాలకు సంబంధించిన ఎఎన్‌ఎంలు ఆయా కుటుంబాలకు అందజేస్తారు.

విజయవాడ సమీపంలోని జక్కంపూడిలో వరద బాధితుల ఇబ్బందులను తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ముంపు ప్రాంతాల్లో సిఎం చంద్రబాబు పర్యటన

ప్రజాశక్తి - భవానీపురం (విజయవాడ) : బుడమేరు వరద బాధిత ప్రాంతాల్లో ఆదివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యటించారు. ముందుగా ప్రకాశం బ్యారేజీ దెబ్బతిన్న గేట్ల మరమ్మతులను పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులు, నిపుణులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వన్‌టౌన్ కుమ్మరిపాలెం జంక్షన్, సితార సర్కిల్, చిట్టినగర్, మిల్క్ ప్రాజెక్టు మీదుగా జక్కంపూడి వెళ్లారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. కుమ్మరిపాలెం సెంటర్లో ఫైర్ ఇంజన్ల ద్వారా రోడ్లు క్లీన్ చేయడాన్ని పరిశీలించారు. జక్కంపూడి వెళ్లి ప్రొక్లయినర్ ఎక్కి ముంపు ప్రాంతాలను పరిశీలించి బాధితులతో మాట్లాడారు. ఆటో డ్రైవర్లతో మాట్లాడి బీమా క్లెయిమ్‌లు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం చిట్టినగర్ సెంటర్, పైపుల రోడ్డు, బిఆర్‌టిఎస్ రోడ్డు మీదుగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అధికారులతో సమీక్ష నిర్వహించారు.

జగన్ తప్పిదం వల్లే పొంగిన బుడమేరు

- మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బుడమేరు పొంగడానికి ప్రధాన కారణం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ఆరోపించారు. ఇది జగన్ మేడ్ డిజాస్టర్ అని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో చంద్రబాబు బుడమేరు ఆధునీకరణకు రూ.464 కోట్లు కేటాయించి పనులు ప్రారంభిస్తే రివర్స్ పాలనలో పనులు నిలిపి విపత్తుకు ప్రధాన కారణమయ్యారని విమర్శించారు. ఆధునీకరణ, మరమ్మతు పనులు ఆపేశారని, సుమారు రూ.500 కోట్లు విలువైన 600 ఎకరాలు వైసిపి నాయకులు కబ్జా చేశారని ఆరోపించారు. 2022లోనే గండి పడినా పట్టించుకోలేదని, ఐదేళ్లలో సరైన నిర్వహణ లేదని తెలిపారు. విజయవాడ నగరంలో స్టోమ్ వాటర్ డ్రైన్ పనులు ఆపేశారని, జగన్ పాలన వైఫల్యాలే నేడు ప్రజల కష్టాలు అని విమర్శించారు. అన్ని సమస్యలను అధిగమిస్తామని, చివరి వరద బాధితుడికి సాయం అందించే వరకూ విశ్రమించమని అన్నారు. ప్రతిపక్ష హోదా డిమాండ్ చేస్తున్న జగన్‌కు ఆ హుందాతనం ఉందా? ప్రశ్నించారు. పాస్‌పోర్ట్ సమస్య లేకపోతే ఎప్పుడో లండన్ ఎగిరిపోవాల్సిందని తెలిపారు. బెంగళూరు ప్యాలెస్‌లో రిలాక్స్ అవుతూ 74 ఏళ్ల వయసులో క్షణం తీరిక లేకుండా వరద బాధితులకు సాయం అందిస్తున్న చంద్రబాబుపై విమర్శలు చేయడానికి మనసు ఎలా వచ్చిందని జగన్‌ను ప్రశ్నించారు. విపత్తులు వచ్చి ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు సొంత డబ్బుతో కనీసం పులిహోర ప్యాకెట్ అందజేసిన చరిత్ర లేదని, ప్రకటించిన సెల్ఫ్ చెక్స్ కథ అందరికీ తెలుసునని అన్నారు.

కొనసాగుతున్న విరాళాలు

- ముఖ్యమంత్రికి పలువురు అందజేత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. పారిశ్రామిక వేత్తలు, వైద్యులు, చలనచిత్ర, విద్యారంగ ప్రముఖులు, ప్రవాస భారతీయులు పలువురు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి విరాళాలు అందిస్తున్నారు. విజయవాడలోని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఈ చెక్కులను శని, ఆదివారాల్లో పలువురు అందజేశారు. ఎపి పోలీస్ అధికారుల సంఘం రూ.11,12,50,000 అందజేశారు. వరుణ్ గ్రూడ్ డైరెక్టర్ వల్లూరుపల్లి లక్ష్మీ కిషోర్, వరుణ్ దేవ్ రూ.2 కోట్లు అందజేశారు. ఆర్‌విఆర్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ శర్నాల గణేష్, దీపక్ నెక్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత ఎవి సుబ్రహ్మణ్యం రూ.1 కోటి చొప్పున అందించారు. వాటర్ సప్లై కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రూ.50 లక్షలు, ఎపి సబ్‌రిజిస్ట్రార్స్ అసోసియేషన్ రూ.25 లక్షలు, సిబార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్, వై రాజారావు రూ.10 లక్షలు చొప్పున ఇచ్చారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా, కె సాంబశివరావు, సిహెచ్ పూర్ణబ్రహ్మయ్య శరత్ బాబు రూ.5 లక్షలు చొప్పున అందించారు. సిటీ చౌదరి రూ.2 లక్షలు, కోవిల్ ప్లాట్స్ ఓనర్స్ రెసిడెంట్ అసోసియేషన్, వెలగపూడి సత్యనారాయణ రూ.2,21,116 చొప్పున అందించారు. ఎం శ్రీనివాసరావు, పువ్వాడ రామకృష్ణ రూ.2 లక్షలు చొప్పున, సిహెచ్ శివరామకృష్ణ రూ.1.32 లక్షలు, బి శాంతి వరలక్ష్మి రూ.1.25 లక్షలు, టిడిపి నేత గోనుగుండ్ల కోటేశ్వరరావు రూ.1,16,000 వేలు అందించారు. బి నవీన్‌బాబు రూ.1,00116, జాస్తి శైలజారాణి, జె శాంభవి, శశాంక్ చౌదరి, ఎస్ సాంబశివరావు, ధూళిపాళ్ల రామకృష్ణ, యు గంగాధర్ రెడ్డి, చెరుకూరి వెంకటరావు, జె సత్యనారాయణ మూర్తి, ఎపి ప్రదేశిక్ మార్వాడి సమ్మేలం, సూరెడ్డి శ్రీధర్ రూ.లక్ష చొప్పున, ఎన్ నాగేశ్వరరావు రూ.70 వేలు, రాణి శారదా, పమిడి భానుచందర్, నూతక్కి వాణి, గుత్తికొండ వెంకటేశ్వరరావు, పెమ్మనబోయిన సమాదానం, అబాజ్ అలీ బాషా రూ.50 వేలు చొప్పున అందించారు. కె భవానీ రూ.35 వేలు, దేవినేని సుధారాణి రూ.30 వేలు, వి రామకృష్ణ రూ.25 వేలు, ఎం అరుణ కుమారి రూ.25 వేలు, యలమంచిలి నళిని కుమారి రూ.25 వేలు, మోహిత్ చక్రితరుష్ రూ.20 వేలు, గద్దె ఝాన్సీరాణి, గోల్డెన్ ట్రీ ఎంటర్‌ప్రైజెస్, పోరెడ్డి రాజశేఖర్ రెడ్డి రూ.10 వేలు చొప్పున అందించారు.

లోకేష్‌కు పలువురు అందజేత

వరద బాధితుల సహాయం కోసం మంత్రి నారా లోకేష్‌కు పలువురు విరాళాలు అందించారు. గుత్తా బాలాజీ రూ.15 లక్షలు, మైనేని శ్రీనివాస్ రూ.10 లక్షలు, వజ్ర ట్రాన్స్‌పవర్ అధినేత యోనిత్య, అశ్వంత్ కలిసి రూ.5 లక్షలు అందించారు. తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కిలారి నాగశ్రావణ్, దాచేపల్లి లక్ష్మీ గాయత్రి హాస్పిటల్స్ అధినేత కామాటి వరలక్ష్మి, వల్లభనేని గిరిబాబు రూ.5 లక్షలు చొప్పున అందించారు. నీలంపాటి అమ్మవారి కోల్డ్ స్టోరేజ్ అధినేత ఎండ్రాటి యజ్ఞతేజ రూ.2 లక్షలు, నంద్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు ముడియం కొండారెడ్డి.. మంత్రి ఫరూక్ ద్వారా రూ.61 వేలు, ఎలిశెట్టి హరనాథ్ రూ.30 వేలు అందజేశారు. విజయవాడకు చెందిన ఎం సత్యానందం రూ.10 వేలు అందజేశారు.

కౌలు రైతులకు న్యాయం చేస్తాం

- కేంద్ర మంత్రి పెమ్మసాని
- వారంలోగా ఈ క్రాప్ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

కౌలు రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని, ఈ క్రాప్ బుకింగ్ పూర్తికానిచోట్ల వారంలోగా నమోదు పూర్తి చేయాలని, రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేదిలేదనీ కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలైన పొన్నూరు, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లో ఆయన ఆదివారం పరిశీలించారు. వెంకటకష్ణాపురం హాఫ్‌పేట, అనుమర్లపూడి, తంగెళ్ళమూడి, శేకూరు, వీరనాయకునిపాలెం, సుందరయ్య కాలనీ, ముట్లూరు ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర, బూర్ల రామాంజనేయులుతో కలిసి ఆయన పర్యటించారు. నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి పెట్టుబడి, నష్టం తదితరు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను రైతులు పెమ్మసాని దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం వరద కారణంగా ఖరీఫ్ సీజన్ మొత్తం వృధాగా పోయిందని, కొన్ని సీజన్లలో సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. జగన్ ప్రభుత్వంలో కేవలం వైసిపి నాయకులకు చెందిన పంటలను మాత్రమే ఈ క్రాప్ బుకింగ్ చేశారని, స్థానికంగా కొన్ని వేల ఎకరాలను ఈ క్రాప్‌లోకి పొందుపరచలేదని చెప్పారు. ఈ సందర్భంగా పెమ్మసాని స్పందిస్తూ.. వారంలోగా ఇక్రాప్ బుకింగ్ మొత్తం పూర్తి చేయాలని, రైతులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదని అధికారులను హెచ్చరించారు. త్వరలోనే ఎత్తిపోతల పథకాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తామని తెలిపారు. అనంతరం ప్రతిపాడు నియోజకవర్గంలోని ముట్లూరులో నీట మునిగిన పొలాలను పరిశీలించారు.

బాధితులకు ఆపన్నహస్తం

- సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యాన ఆహారం, మందులు పంపిణీ
- పారిశుధ్య పనుల్లోనూ సాయం

ప్రజాశక్తి - విజయవాడ

బుడమేరు ముంపు బారిన పడిన బాధితులకు సేవలందించేందుకు సిపిఎం నేతలు, ప్రజా సంఘాల కార్యకర్తలు ముందుకొచ్చారు. మానవత్వం చాటుకుంటూ సేవా కార్యక్రమాలు చేపట్టారు. బాధితుల ఆకలి తీర్చేందుకు భోజన కేంద్రాలను ఏర్పాటు చేసి నిరంతరం ఆహారం పంపిణీ చేస్తున్నారు. వీధుల్లో వ్యర్థాలను తొలగించేందుకు శ్రమదానం చేస్తున్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ఉచితంగా మందులు అందిస్తున్నారు. ఏ కష్టమొచ్చినా బాధితులకు అండగా ఉన్నామంటూ భరోసా కల్పిస్తున్నారు.

విజయవాడ అజిత్ సింగ్‌నగర్, వాంబే కాలనీ, ఆర్ఆర్‌పేట, కండ్రిక, శాంతినగర్, ప్రకాష్‌నగర్, పాయకాపురం, నందమూరినగర్, ఆంధ్రప్రభ కాలనీ, వడ్డెరకాలనీ, ఉడా కాలనీ, ఎల్‌బిఎస్ నగర్ తదితర ప్రాంతాల్లో ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్దఎత్తున శ్రమదానం చేశారు. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, కెవిపిఎస్ తదితర ప్రజా సంఘాల కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని వీధుల్లో ఉన్న వ్యర్థాలను తొలగించారు. శ్రమదానం చేసి పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. ఇళ్లలోని వ్యర్థాలను తొలగించడానికి, శుభ్రం చేయటానికి బాధితులకు సహకరించారు. రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన సుమారు 90 మందికిపైగా యువజన, విద్యార్థి కార్యకర్తలు సేవా, సహాయ కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. బాధితులకు అండగా నిలిచి ఆపన్న హస్తంగా నిలిచారు. వరద బాధితులకు అండగా నిలిచి అవిశ్రాంతంగా వివిధ రూపాల్లో సేవలందించారు. ఆయా ప్రజా సంఘాలు, సిపిఎం కార్యకర్తల సేవలను వరద బాధితులు అభినందించారు. సేవ, సహాయ కార్యక్రమాల్లో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రసన్నకుమార్, ఎ.అశోక్, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాము, జి రామన్న, వివిధ ప్రజా సంఘాలు, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్‌లో వైద్య శిబిరం ఏర్పాటు

అజిత్‌సింగ్ నగర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో వరద బాధితుల కోసం వైద్య శిబిరం ప్రారంభించారు. డాక్టర్ మాకినేని రామారావు, డాక్టర్ కె.భాస్కరరావు స్మారకార్థం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య సేవలందించారు. ఇందుకు ఇండియన్ మెడికల్ అసోసియన్ వారు సహకారం అందించారు. ప్రజా వైద్యశాల కిరణ్ వాస్క్యులర్ సర్జరీ సెంటర్ వైద్యులు డాక్టర్ మాకినేని కిరణ్ సహకారంతో డాక్టర్ జిలాని, సిబ్బంది ప్రభాకర్, సిసింద్రీ, శ్రావణి తదితరులు వైద్య సేవలందించారు. శని, ఆదివారాల్లో 600 మందికిపైగా వైద్య సహాయం పొందారు. జ్వరం, జలుబు, దగ్గు, చర్మవ్యాధులు, ఆయాసం, వాంతులు, విరోచనాలు తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి చికిత్స అందించారు. సుమారు రూ.50 వేల విలువైన మందులను పంపిణీ చేశారు. ఈ శిబిరం సోమవారం కూడా కొనసాగుతుంది.

మరో భోజన పంపిణీ కేంద్రం ఏర్పాటు

వరద ప్రభావిత ప్రాంతాల్లో సిపిఎం ఆధ్వర్యాన ఆదివారం మరో భోజన కేంద్రం ఏర్పాటు చేశారు. కొత్తగా విజయవాడ వాంబేకాలనీలో నిరంతర భోజన కేంద్రం ఏర్పాటు చేయగా, రెండు రోజుల క్రితం అజిత్ సింగ్‌నగర్ పైపుల్ రోడ్డులో ఏర్పాటు చేసిన నిరంతర భోజన పంపిణీ కేంద్రం కొనసాగుతోంది. ఆదివారం 3 వేల మందికిపైగా బాధితులకు రెండు పూటలా భోజనం, రెండు వేల మందికిపైగా అల్పాహారం అందించారు. జోరు వర్షంలోనూ అక్కడికక్కడే వంట చేసి బాధితులకు అందిస్తున్నారు. కేవలం వరద బాధితులే కాకుండా ప్రభుత్వ విధుల్లో పాల్గొంటున్న పోలీసులు, ఎన్‌డిఆర్‌ఎఫ్, మున్సిపల్, వివిధ శాఖలకు సంబంధించిన సిబ్బంది కూడా భోజనాలు చేశారు. బాధితులకు నిరంతరం భోజనం అందించడంపట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అవసరాన్ని బట్టి భోజన కేంద్రాన్ని కొనసాగిస్తామని సిపిఎం నేతలు ప్రకటించారు. అలాగే సిపిఎం నేతలు, ప్రజా సంఘాల కార్యకర్తలు అజిత్ సింగ్‌నగర్, పాయకాపురంలోని శాంతినగర్, ప్రకాష్‌నగర్, వాంబే కాలనీ, ఎల్‌బిఎస్ నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి బాధితుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ తక్షణ సహాయంతోపాటు వరద ముంపు నుండి శాశ్వత నివారణ చర్యలపై ప్రభుత్వం దష్టి సారించాలని డిమాండ్ చేశారు. మొబైల్ వ్యాన్ల ద్వారా నిత్యావసరాలు, కూరగాయలు తక్కువ ధరకు అందించాలని కోరారు. దెబ్బతిన్న వాహనాలకు బీమా పరిహారం చెల్లింపు విషయంపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, బస్సులు, ప్రజా రవాణాను పునరుద్ధరించాలని, అసంఘటిత కార్మికులు, చిరు వ్యాపారులు, చేతివృత్తులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి హాజరైన వరద బాధితులు

అజిత్‌సింగ్‌నగర్‌లో వ్యర్థాలను తొలగిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శ వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు.. విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

కండ్రికలో డివైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆహార పంపిణీ

కొండ చరియలు ఘటనలో నిరాశ్రయులకు భోజనం

విజయవాడ మొగల్రాజపురంలో ఇటీవల కొండ చరియలు విరిగిపడిన ఘటనలో నిరాశ్రయులైన వారికి సున్నపుభట్టీల సెంటర్ వద్ద ఉన్న పూలే అంబేద్కర్ భవనంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఏర్పాటు చేశారు. వారం రోజులుగా పూలే అంబేద్కర్ భవనంలోని పునారావాస కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, మెడికల్, సచివాలయం సిబ్బందికి భోజనం, అల్పాహారం అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.క్రాంతికుమార్, పిఎన్ఎం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శులు ఎస్ అనిల్ కుమార్, జి.రామన్న, ఎ.అశోక్ , యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సిసి కెమెరాల్లో రికార్డు అయిన పులి

రాజమండ్రిలో చిరుత కలకలం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో చిరుత సంచారం కలకలం రేగింది. హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలోని ఆకాశవాణి కేంద్రం వద్ద సిసి కెమెరాల ద్వారా చిరుత సంచారం శనివారమే వెలుగులోకి వచ్చింది. దీంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. చిరుత జాడ కోసం ముమ్మర ప్రయత్నం చేస్తున్నారు. ఆరు ప్రాంతాల్లో 54 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు. అటవీ శాఖ అధికారులతోపాటు 30 మంది సిబ్బంది చిరుత జాడను కనిపెట్టే పనిలో ఉన్నారు. ఆకాశవాణి కేంద్రం సమీపంలో రెండు అనుమానిత పాదముద్రలను వారు గుర్తించారు. రిజర్వ్ ఫారెస్టు పరిసర ప్రాంతాలైన హౌసింగ్ బోర్డు కాలనీ, స్వరూప్ నగర్, రూపా నగర్, శ్రీరాంపురం, దివాన్ చెరువు గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ మేరకు గ్రామాల్లో టాంటాం వేయించారు. సాయంత్రం 6 నుంచి ఉదయం 6 గంటల వరకూ ఒంటరిగా ఎవరూ బయటకు రావొద్దని హెచ్చరించారు.

ఊటుకూరులో వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - ముదినేపల్లి (ఏలూరు)

ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం ఊటుకూరు గ్రామంలో శనివారం దారుణం చోటు చేసుకుంది. బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ప్రత్యర్థులు దారికాచి మారణాయుధాలతో దాడి చేసి హత్య చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఊటుకూరు గ్రామానికి చెందిన పోసిన బాలకోటయ్య (52)కు రెండు జెసిబిలు ఉన్నాయి. కృష్ణా జిల్లా మల్లపరాజుగూడెం పంచాయతీలో జెసిబి డ్రైవర్‌కు ఆయిల్ క్యాన్ ఇచ్చి, మరో ఆయిల్ క్యాన్ ద్విచక్రవాహనంపై పెట్టుకొని ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో మల్లపరాజుగూడెం- ఊటుకూరు గ్రామాల పొలిమేరలోకి వచ్చేసరికి అప్పటికే దారికాచిన ప్రత్యర్థులు బాలకోటయ్యపై ఒక్కసారిగా మారణాయుధాలతో దాడి చేశారు. దీంతో తలకు బలమైన గాయమవ్వడంతో ఆయన అక్కడికక్కడే మరణించారు. బాలకోటయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. మృతునికి, హత్య చేసిన వ్యక్తి కుటుంబానికి గత మూడు నెలలుగా పాత గొడవలు ఉండడంతో ఒకరిపై ఒకరు గతంలో కేసులు పెట్టుకున్నారు. మృతుడు ఒక కేసులో నెల రోజులు జైలు శిక్ష కూడా అనుభవించి వచ్చాడు. బాలకోటయ్యను అతని మేనమామ శివాజీ, అతని అన్నదమ్ములు, వారి కుటుంబసభ్యులే హత్య చేశారని మృతుని కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వెలుగొండ పూర్తయితే... 'కృష్ణా'కు వరద ముప్పు తగ్గేది!

- టిడిపి కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తుందా?

ప్రజాశక్తి- ఒంగోలు బ్యూరో

శ్రీశైలం జలాశయం నుంచి రెండు సొరంగాల ద్వారా నీటిని తరలించి వెలుగొండ రిజర్వాయర్‌ను నింపాల్సి ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు నిండే ముందు అంటే గేట్లు ఎత్తే సమయంలో ఉండే వరద నీటిని వెలుగొండ ప్రాజెక్టుకు రోజుకు ఒక టిఎంసి చొప్పున 40 రోజుల్లో 40 టిఎంసిలు తరలించాలనేది ప్రాజెక్టు ప్లాన్. ప్రస్తుతం అన్ని సాగునీటి ప్రాజెక్టులూ నిండిపోయాయి. వెలుగొండకు మాత్రం నీటిని తరలించే అవకాశం ప్రస్తుతం లేదు. రెండో సొరంగంలో 6,834 మీటర్లు, మొదటి సొరంగంలో 1,053 మీటర్లు పొడవున లైనింగు పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టు పూర్తయి ఉంటే 4.47 లక్షల ఎకరాలకు సాగు నీరు, 15.25 లక్షల మందికి తాగునీటి సమస్య తీరేది.

కృష్ణా నదికి వరద ముప్పు ఎంతోకొంత తప్పేది. వెలుగొండ ప్రాజెక్టును ఈ ఏడాది ఎన్నికలకు ముందు అప్పటి సిఎం జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించారు. అయితే, పనులు పూర్తి కాలేదు. మొదటి ఏడాదిలోనే వెలుగొండను పూర్తి చేస్తామని అధికారంలోకి వచ్చాక జగన్ చెప్పారు. ఐదేళ్లకూ పూర్తి చేయలేదు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయం నుంచి లక్షలాది క్యూసెక్కుల వరద నీరు దిగువకు ప్రవహిస్తోంది. దిగువన ఉన్న ప్రాజెక్టులన్నీ నిండిపోయాయి. ఆదివారం నాడు కూడా శ్రీశైలం, సాగర్, పులిచింతల గేట్లు ఎత్తారు. ప్రకాశం బ్యారేజీ వద్ద మళ్లీ నాలుగు లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. వెలుగొండ ప్రాజెక్టు పూర్తయి ఉంటే ఇప్పుడున్న వరద నీటితో ఈ ఏడాది నిండిపోయేది. మూడు జిల్లాలకు ప్రయోజనం కలిగేది.

పరిహారం, పునరావాసం ఏదీ?

రిజర్వాయర్ పరిధిలో 11 ముంపు గ్రామాల్లో ఏడు వేల మంది నిర్వాసితులు ఉన్నారు. వీరికి ప్రభుత్వం నేటికీ పునరాసం కల్పించలేదు. ప్యాకేజీలు ఇవ్వలేదు. కాలనీలు కేటాయించారే తప్ప, అక్కడ ఇళ్లు కట్టించలేదు. కనీసం సౌకర్యాలు కల్పించలేదు. వన్‌టైమ్ సెటిల్‌మెంటు కింద ఒక్కో నిర్వాసితుడికి రూ.12.50 లక్షలు ఇచ్చి పంపాలని నిర్ణయించారు. ఇందుకు నిధులు విడుదల కాక ఈ ప్రక్రియ పెండింగులో పడింది. 2023-24 బడ్జెట్లో దీనికి కేవలం రూ.101.47 కోట్లు కేటాయించారు. ఈ ఏడాది ఓటాన్ బడ్జెట్లో రూ.1544.07 కోట్లు చూపారు. ఈ నిధులను విడుదల చేయాల్సి ఉంది. వైసిపి ప్రభుత్వం పనులు పూర్తి చేయకుండానే దీన్ని ప్రారంభించినా టిడిపి కూటమి ప్రభుత్వం ఇంకా దీనిపై దృష్టి సారించలేదు.

మున్నేరుకు పెరుగుతున్న వరద

కీసర బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరు

ప్రజాశక్తి-యంత్రాంగం

తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలు, వాయుగుండం ప్రభావంతో ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లోని వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ, కంచికచర్లలోని మున్నేరుకు వరద ఉధృతి పెరుగుతోంది. కీసర బ్రిడ్జి వద్ద ఆదివారం మునేరు వరద 75 వేల క్యూసెక్కులు ప్రవహించింది. ఆదివారం రాత్రికి వరద పెరిగే అవకాశం ఉందని సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. ఇటీవల మునేరుకు భారీగా వరద రావడంతో ఐతవరం వద్ద జాతీయ రహదారిపై నీరు ప్రవహించి 24 గంటలపాటు విజయవాడ- హైదరాబాద్ రహదారిపై రాకపోకలు నిలిపివేశారు. తీర గ్రామాలైన గండేపల్లి, పెండ్యాల, ఎస్ అమరవరం, వేములపల్లి గ్రామాలు నీటమునిగాయి. ఆదివారం మునేరు వరద మరోసారి పెరగడంతో అధికారులు తీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే పనులను ముమ్మరం చేశారు. బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో శనివారం ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా ఎడతెరపిలేని భారీ వర్షం కురిసింది. ఇటీవల ఐదు రోజులుగా కష్ణానది, మునేరు, బుడమేర వరద ముంపు నుండి తేరుకుంటున్న జిల్లా వాసులకు మళ్లీ భారీ వర్షంతో ఎప్పుడు, ఎటు నుండి వరద ముంచెత్తుతుందోనని భయాందోళనకు గురవుతున్నారు. శనివారం ఉదయానికి కంచికచర్లలో 33 మిల్లీ మీటర్లు, సాయంత్రం 6 గంటలకు మరో 50 మిల్లీ మీటర్ల వర్షపాదం నమోదైంది. నందిగామ, తిరువూరు, మైలవరం, ఇబ్రహీంపట్నం, జగ్గయ్యపేటతోపాటు, విజయవాడ నగరంలోనూ వర్షం దంచికొట్టింది. బుడమేర వరద ముంపు నుండి కొద్దిగా తేరుకుంటున్న ప్రజలు పునరావాస కేంద్రాల నుండి ఇళ్లకు వెళ్తున్నారు. ఇంకా బాధితులకు సహాయ చర్యలు చేస్తున్నారు. భారీ వర్షం వల్ల సహాయ చర్యలకు ఆటంకం కలుగుతోంది. మరో పక్క నందిగామ నుండి మునేరుకు వరద పెరిగింది. వీటితోపాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న చిన్న వాగులకు వరద ప్రవాహం పెరిగింది. లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయి. విజయవాడ నగరంలో భారీ వర్షం కురవడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాల వాసులను పునరావాస కేంద్రాలకు తరలించాలని కలెక్టర్ డాక్టర్ సృజన సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం రాత్రి కూడా భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు..

ఎనిమిది గేట్ల ద్వారా నీటి విడుదల

శ్రీశైలం వద్ద 8 గేట్ల ఎత్తివేత

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుండి వరద ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. కృష్ణానది నుండి నీటి ప్రవాహం పెరిగింది. దీంతో ఎనిమిది గేట్లను పది అడుగుల మేర ఎత్తి 2,19,096 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి ఎగువ జూరాల నుండి 1,69,839 క్యూసెక్కులు, తుంగభద్ర ద్వారా 35,832 మొత్తం కలిపి 2,05,671 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. అదే సమయానికి శ్రీశైలం జలాశయం నీటిమట్టం 885 అడుగులకుగాను, ప్రస్తుతం 883.40 అడుగులుగా ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 206.9734 టిఎంసిలుగా ఉంది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ 20,000 క్యూసెక్కులు, హంద్రీనీవా సుజల స్రవంతికి 1450 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడచిన 24 గంటలలో ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 16.790 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేస్తూ 37,116 క్యూసెక్కుల నీటిని, కుడి గట్టు జల విద్యుత్తు కేంద్రంలో 15.329 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తిని చేస్తూ 30,822 క్యూసెక్కులతోపాటు 8 గేట్ల ద్వారా, శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి, విద్యుత్ ఉత్పత్తి ద్వారా కలిపి మొత్తం జలాశయం నుండి 3,08,484 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద తగ్గిన వరద

గోదావరి తగ్గుముఖం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

గోదావరి వరద ప్రవాహం ఆదివారం నాటికి సాధారణ స్థితికి చేరుకుంది. శుక్రవారం నుంచే తగ్గుముఖం పట్టిన గోదావరి ఆదివారం నాటికి పూర్తిగా తగ్గింది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు భద్రాచలం వద్ద 26.70 అడుగులకు నీటి మట్టం చేరుకుంది. ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద కూడా ప్రవాహం పూర్తిగా తగ్గింది. ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు శనివారమే ఉపసంహరించారు. ప్రస్తుతం బ్యారేజీ వద్ద 8 అడుగుల నీటి మట్టం నమోదైంది. బ్యారేజీ నుంచి 4,98,094 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువలకు సాగు, తాగు నీటి అవసరాల నిమిత్తం 3,300 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. వరద తగ్గడంతో కోనసీమ జిల్లాలోని లంకవాసులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలు వారిని కలవరానికి గురిచేస్తున్నాయి.

15 వరకు గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న గ్రీవెన్స్‌ను ఈ నెల 15 వరకు రద్దు చేస్తున్నట్లు పార్టీ కార్యాలయం కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు వెల్లడించారు. అకాల వర్షాలు, వరదలు కారణంగా అధికారులు, మంత్రులు, ప్రజా ప్రతినిధులు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారని తెలిపారు.

IN THE COURT OF THE CHAIRMAN MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL (WOMENS COURT CUM IV ADDI. DISTRICT JUDGE) AT NALGONDA
M.V.O.P.NO. 303 OF 2022

Between:
Mummadi Narsimha Chary and others. **...Petitioners**
AND
Nagoor Basha Shaik and others. **...Respondents**

To
RI- Nagoor Basha Shaik S/o Mohammed. Aged: 48 years, R/o H.No.5-248. Kummari Chervu village of Gudivada Mandal, Krishna District. (Driver of the Milk Lorry bearing No. AP-16-TC-2619)

Take notice that the petitioner has filed the above O.P. for grant of compensation on account of death of one Mummadi @ Bogoju Vijaya Laxmi, who died in a motor vehicle accident against you and others. The said case is posted to 20-09-2024 for your appearance.

Hence, you are hereby directed to appear in person or through Advocate before the court on 20-09-2024 at 10-30 A.M., without fail, failing which the matter will be decided against you as per law.

BY ORDER OF THE COURT
ALWALA VASANTHA RAO, ADVOCATE
#8-2-88/2/2, Dhatushata Colony. Opp: Govt. Hospital, Goltaguda, NALGONDA, T.S. Celi: 9440102023

దీప్తికి రూ. కోటి నజరానా

- తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్ :

పారాలింపిక్స్‌లో పతకం సాధించి భారత దేశం గర్వపడేలా చేసిన పారా అథ్లెట్ దీప్తి జీవాంజికి రాష్ట్ర ప్రభుత్వం భారీ నగదు ప్రోత్సాహకం ప్రకటించింది. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. కాంస్య పతకం సాధించిన దీప్తి జీవాంజి శుక్రవారం హైదరాబాద్‌కు చేరుకోగా.. అభిమానులు, శాట్జ్ యంత్రాంగం భారీ స్థాయిలో స్వాగతం పలికిన సంగతి తెలిసిందే. శనివారం ఉదయం ముఖ్యమంత్రి

రేవంత్‌రెడ్డిని దీప్తి జీవాంజి ఆయన నివాసంలో కలిశారు. దీప్తిని, ఆమె కోచ్ నాగపురి రమేశ్‌ను సీఎం అభినందించారు. తెలంగాణ గర్వపడే పతక ప్రదర్శన చేసినందుకు దీప్తి జీవాంజికి రూ. 1 కోటి నగదు ప్రోత్సాహకంతో పాటు జీవనోపాధికి గ్రూప్-2 ఉద్యోగం ప్రకటించారు. కోచ్‌కు రూ.10 లక్షల ప్రోత్సాహకం సైతం ప్రకటించారు.

ఎఎన్‌యులో పాముకాటు

- మయన్మార్ విద్యార్థి మృతి

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విషాదం చోటుచేసుకుంది. పాముకాటుకు గురై మయన్మార్‌కు చెందిన విద్యార్థి మృతి చెందారు. తోటి విద్యారుథల కథనం ప్రకారం.. బుద్ధిజంలో ఎంఎ చేస్తున్న కొండన్న శనివారం సాయంత్రం యూనివర్సిటీలో పుట్టగొడుగులు సేకరించేందుకు వెళ్లారు. ఈ క్రమంలో రక్తపింజర పాము కాలిపై కాటు వేసింది. వెంటనే ఆయనను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. మయన్మార్‌లోని మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించామని వర్సిటీ అధికారులు తెలిపారు. ఈ ఘటనపై మంత్రి నారా లోకేష్ విచారం వ్యక్తం చేశారు. కొండన్న కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. కొండన్నకు ఎస్ఎఫ్ఐ వర్సిటీ కార్యదర్శి కె.నవిత సంతాపం తెలిపారు. మృతుని కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ ఘటనపై ప్రత్యేక కమిటీతో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

ప్రకాశం బ్యారేజికి మళ్లీ వరద పోటు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రకాశం బ్యారేజీకి మళ్లీ వరద పోటు పెరిగింది. ఎగువ నుంచి 4.50 లక్షల క్యూసెక్కులు ఆదివారం రాగా వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయానికి 2.86 లక్షల క్యూసెక్కులు రాగా 2.79 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్‌కు 2.60 లక్షల క్యూసెక్కుల వరద రాగా అదే స్థాయిలో దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల జలాశయయానికి 2.09 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండగా 2.02 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. పులిచింతల దిగువన కురుస్తున్న వర్షాలతో పాటు ఖమ్మం జిల్లా మున్నేరు వాగుతో పాటు కట్టలేరు ప్రవాహం కూడా కలవడంతో ప్రకాశం బ్యారేజీకి 2.48 లక్షల క్యూసెక్కులు వచ్చి కలవడంతో నాలుగున్నర లక్షల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో వచ్చిన నీటిని వచ్చినట్టు సముద్రం లోకి విడుదల చేస్తున్నారు.

పెరిగిన కొల్లేరు నీటిమట్టం

ప్రజాశక్తి - మండవల్లి (ఏలూరు)

కొల్లేరు నీటిమట్టం రోజురోజుకూ పెరుగుతుంది. శనివారం 3.3 మీటర్లుగా ఉన్న కొల్లేటి నీటిమట్టం ఆదివారం నాటికి 3.4 మీటర్లకు చేరింది. మరో రెండు, మూడు రోజుల్లో పైనుంచి వరద నీరు కొల్లేరులోకి భారీగా వచ్చి చేరే అవకాశం ఉండడంతోపాటు, తుపాను ప్రభావంతో విస్తారంగా వర్షాలు పడుతుండడంతో ముంపు బాధితులు మరింత భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొల్లేరు పరివాహక ప్రాంత గ్రామాలకు రాకపోకలు పూర్తిస్థాయిలో స్తంభించిపోయాయి. కైకలూరు, ఏలూరు ప్రధాన రహదారిపై కూడా వరద నీరు సుమారు ఐదు అడుగుల మేర పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలను పూర్తిస్థాయిలో నిలుపుదల చేశారు. ముంపుబారిన పడిన గ్రామాల ప్రజలు నిత్యావసర సరుకులతో పాటు తాగేందుకు నీరులేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రహదారులన్నీ జలమయం కావడంతో ఇతర గ్రామాలకు వెళ్లి తాగునీరు తెచ్చుకునే సౌకర్యం లేకుండా పోయిందని, నిత్యావసర సరుకులతో పాటు తాగునీరు కూడా అందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పొంగి ప్రవహిస్తున్న ఎర్రకాలువ

టి.నరసాపురం మండలం మధ్యాహ్నపువారి గూడెం - అప్పలరాజుగూడెం గ్రామాల మధ్య ఉన్న ఎర్రకాలువ వాగు పొంగి ప్రవహిస్తోంది. కాలువలో నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించారు. వరద ప్రవాహం ఎక్కువైతే వాగు ఉధృతంగా ప్రవహిస్తుందని, వాగులు ఉన్న మార్గాల్లో ప్రయాణాలు చేయొద్దని ఎస్ఐ ఎం.జయబాబు హెచ్చరించారు.

కాంగ్రెస్ నేతలతో జగన్ భేటీ : వర్ల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇండియా కూటమిలో చేరేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బెంగళూరులో కాంగ్రెస్ నేతలతో సమావేశమయ్యారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ఆరోపించారు. అక్కడ స్థానిక కాంగ్రెస్ నాయకులకు విందు ఇచ్చి రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నించారని పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రకాశం బ్యారేజ్ గేట్లను నాలుగు పడవలు ఢీ కొట్టడంలో జగన్, సజ్జల కుట్ర ఉందని విమర్శించారు. ఆ పడవలు వైసిపి నాయకులు నందిగం సురేష్, తలశిల రఘురామ్ అనుచరులవేనని పేర్కొన్నారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేసి కుట్ర వెలికి తీయాలన్నారు. చంద్రబాబు 9 రోజుల నుంచి కలెక్టర్ కార్యాలయంలోనే ఉండి చేస్తున్న పనితీరును కేంద్ర మంత్రులతో సహా అభినందిస్తున్నారని తెలిపారు. వైసిపి నాయకులకు ధైర్యం ఉంటే ప్రజాక్షేత్రంలోకి రావాలని డిమాండ్ చేశారు.

HDFC BANK
We understand your world

రిజిస్టర్డు ఆఫీసు: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్ (వెస్ట్), ముంబయి-400 013 మరియు దీని ఆఫీసులో ఒకటైన: రిటైల్ పోర్ట్‌ఫోలియో మేనేజిమెంట్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, 1వ అంతస్తు, ఐ-థింక్ టెక్నో క్యాంపస్, కంజూర్‌మర్గ్ (ఈస్ట్), ముంబయి-400042.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్‌కు తాకట్టుపెట్టిన సెక్యూరిటీస్ అమ్మకం కొరకు అమ్మకం ఆహ్వానం& బహిరంగ ప్రకటన.

హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్ (ది "బ్యాంక్") యొక్క దిగువ పేర్కొన్న రుణగ్రహీతలును ఆస్తులపై రుణస్వభావం/ఓవర్‌డ్రాఫ్ట్ లో రుణ సదుపాయం పొందుట కొరకు, బ్యాంకుకు తాకట్టుపెట్టిన సెక్యూరిటీస్ అమ్మకంకు సంబంధించి ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమైనది.
డెలిక్వింట్ స్టేటస్‌లో దిగువ రుణ ఖాతాలు, అంగీకరించిన రుణ నియమాల ప్రకారం బకాయి మొత్తాలను తిరిగి చెల్లించుటలో రుణగ్రహీతలచేత పెర్సిస్టెంట్ డిఫాల్టి కారణంగా, అట్టి రుణగ్రహీతలకు అనేక నోటీసులును బ్యాంకు జారీచేసింది, మరియు బ్యాంకు ఇన్‌వోక్డ్ ప్లెడ్జ్ కలిగియుండి, మరియు దిగువ ఖాతాల్లో పూర్తి బకాయి మొత్తాలను తిరిగి చెల్లించవలసిందిగా రుణగ్రహీతకు 7 రోజుల సమయం ఇచ్చింది, ఏదైతే విఫలంచెందిన, ఈ విషయంలో బ్యాంకు తదుపరి నోటీసు ఇవ్వకుండానే తాకట్టుపెట్టిన సెక్యూరిటీస్‌ను అమ్మకానికి పెట్టు ఆస్కారం ఉంటుంది. రుణగ్రహీతలు బకాయిని తిరిగి చెల్లింపుచేయుటలో అశ్రద్ధ మరియు విఫలంచెందినందున, కావున, బ్యాంకుకు రుణగ్రహీతల ద్వారా బకాయిని రాబట్టుట కొరకు తాకట్టుదారు అంగీకరించిన రుణం క్రింది దీని హక్కులను వినియోగించుకొని, **16 సెప్టెంబర్ 2024** న లేదా ఆ తరువాత, సెక్యూరిటీస్‌ను విక్రయించు/ డిస్పోస్ ఆఫ్‌చేయుటకు నిర్ణయించింది. రుణగ్రహీతలు ఇది కూడా గమనించవలసింది ఏమనగా, ఈ విషయంలో ఏదేని తదుపరి నోటీసు ఇవ్వకుండానే ఒక (1) క్యాలెండర్ రోజుల్లోగా తాకట్టుపెట్టిన సెక్యూరిటీస్‌ను బ్యాంకుకు అవసరమైన మార్జిన్‌లో తదుపరి డిఫిసెన్సీ నెలకొల్పుటకు స్టాక్ మార్కెట్‌లో వొలటిలిటీ కి తదుపరి బకాయిని తాకట్టుపెట్టిన సెక్యూరిటీస్ విలువను పోలుస్తుంది. ఏవేని మిగతా బకాయి మొత్తాలను, తాకట్టుపెట్టిన సెక్యూరిటీస్ అమ్మకం నుండి రాబట్టిన మొత్తాలును సర్దుబాటు చేసిన తరువాత ఏవేని మిగతా బకాయి మొత్తాలను తిరిగి చెల్లించుట కొరకు బ్యాంకుకు రుణగ్రహీతలు చెల్లించు ఆస్కారం ఉంటుంది.

క్ర. సం.	రుణ ఖాతా నంబరు	రుణగ్రహీతల పేరు	04 సెప్టెంబర్ 2024 నాటికి బకాయి మొత్తాలు	అమ్మకపు ప్రకటన తేది
1	XXXX8216	నారాయణం కీర్తిప్రియ	26,814.81	17-08-2024

తేది: 09.09.2024 సం/-
ప్రదేశం: ఆం.ప్ర. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్.

'ఉక్కు' రక్షణకు కేంద్రంపై ఒత్తిడి

- 10న రాస్తారోకోలు జయప్రదానికి పిలుపు
- విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి రౌండ్ టేబుల్ సమావేశం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసి, పూర్తి స్థాయి సామర్థ్యంతో నడిపించే విధంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై రాష్ట్రంలోని టిడిపి కూటమి ఒత్తిడి తేవాలని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. విశాఖలోని జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో జెఎసి సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ తమకు అధికారమిస్తే స్టీల్‌ప్లాంట్ అమ్మకం జరగదని, పూర్తిస్థాయి సామర్థ్యంతో నడిపించి అభివృద్ధి బాట పట్టిస్తామని రాష్ట్రంలోని టిడిపి, జనసేన, బిజెపి కూటమి ఎన్నికల్లో ప్రజలకు వాగ్దానం చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చాక ప్లాంట్ పరిరక్షణకు ఎటువంటి చర్యలూ చేపట్టలేదన్నారు. పైగా కేంద్ర ప్రభుత్వ చర్యలు స్టీల్‌ప్లాంట్‌ను మరింత అగాథంలోకి నెడుతున్నాయని విమర్శించారు. ప్లాంట్ ఉత్పత్తి సామర్థ్యం రోజుకు 21 వేల టన్నులు కాగా నేడు కేవలం 6 వేల టన్నుల ఉత్పత్తి మాత్రమే జరుగుతోందని తెలిపారు. ప్లాంటుకు అవసరమైన బొగ్గు, ఐరన్ ఓర్ తదితర ముడిసరుకులను రాకుండా కేంద్రం అడ్డుకుంటోందని, సొంత గనులు కేటాయించకుండా వివక్ష చూపుతోందన్నారు. ఫలితంగా ప్రతి టన్ను స్టీల్ ఉత్పత్తికి విశాఖ ఉక్కు

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

కర్మాగారానికి రూ.4 వేలు అదనంగా ఖర్చవుతోందని తెలిపారు. ప్లాంట్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 536.6 మెగావాట్లు కాగా బొగ్గు కొరతను సృష్టించడంతో నేడు కేవలం 120 మెగావాట్ల విద్యుత్తు మాత్రమే ఉత్పత్తి అవుతోందన్నారు. దీనివల్ల ప్రతి నెలా ప్లాంట్ ఎపిఇపిడిసిఎల్ నుంచి నెలకు రూ.45 కోట్లు నుండి రూ.80 కోట్ల విలువైన విద్యుత్తును కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. ఒకప్పుడు 19 వేల మంది పర్మినెంట్ ఉద్యోగులు ఉండగా ప్రస్తుతం 12,500 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. ఈ ఏడాది చివరకు 1400 మంది రిటైర్ కాబోతున్నారని, మరో 2500 మందిని విఆర్ఎస్ పేరుతో బయటకు పంపాలని చూస్తున్నారని, ఛత్తీస్‌గడ్‌లోని నాగర్‌నార్ స్టీల్‌ప్లాంట్‌కు 500 మందిని బదిలీ చేయాలని కేంద్రం కుట్రలు పన్నుతోందని తెలిపారు. ప్లాంట్‌కు రూ.7 వేల కోట్లు వర్కింగ్ క్యాపిటల్ ఇస్తే లాభాల బాట పట్టిస్తామని కార్మికులు కోరుతుంటే మోడీ ప్రభుత్వం ఖాతరు చేయడం లేదని ధ్వజమెత్తారు. ఆఫీసర్లకు, పర్మినెంట్, కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం లేదని తెలిపారు. ఇటీవల కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి.కుమారస్వామి ప్లాంట్‌లో పర్యటించి కర్మాగారాన్ని అమ్మే ప్రసక్తే లేదని ప్రకటించి రెండు నెలలు అవుతున్నా అతీగతి లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 10న జరిగే ఉక్కు రక్షణ రాస్తారోకోలను జయప్రదం చేయాలని కోరారు. విశాఖలో ఆ రోజు ఉదయం 10 గంటలకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్దనున్న జెఎసి దీక్షా శిబిరం వద్ద ప్రదర్శన ప్రారంభమవుతుందని తెలిపారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణలో రాస్తారోకో నిర్వహించనున్నట్టు వెల్లడించారు. రౌండ్ టేబుల్ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం, టిఎన్‌టియుసి జిల్లా కార్యదర్శి పైడిరాజు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మధరావు, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

homefirst
We'll take you home

Home First Finance Company India Limited,
CIN:L65990MH2010PLC240703, Website: homefirstindia.com
Phone No.: 180030008425 Email ID: loanfirst@homefirstindia.com

DEMAND NOTICE U/s 13(2)

దిగువ పేర్కొన్న రుణగ్రహీతలైన మీరు షెడ్యూలులో పేర్కొన్న ఆస్తిని తాకట్టు ద్వారా రుణం పొందియున్నారు మరియు రుణ ఒప్పందం కొరకు రుణగ్రహీత/సహ-రుణగ్రహీత, హామీదారుగా దిగువ పేర్కొన్న మీరు వున్నారు. మీరు చెల్లించుటలో డిఫాల్టి చెందినందున, దీ సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ చట్టం, 2002 (సంక్షిప్తంగా సర్ఫేసి యాక్ట్) యొక్క నియమాల క్రింద, మీ రుణ ఖాతా **03.09.2024**న నాన్-పెర్ఫామింగ్ అసెట్‌గా వర్గీకరించబడినది. మేము హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్, మీరు పేర్కొన్న చిరునామాలకు సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(13)తో చదువబడే సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసును జారీచేశాము. సదరు నోటీసు **03.09.2024**న జారీచేయబడినది మరియు అట్టి నోటీసులో పేర్కొన్నది ఏమనగా మీకు మంజూరైన వివిధ రుణాలను తిరిగిచెల్లించుటలో మీరు డిఫాల్టి చెందారని ఉంది. కావున ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 3(1)కు నియమాలలో సర్ఫేసి చట్టంలోని సెక్షన్ 13(2) యొక్క నియమాల ప్రకారం ప్రస్తుత ప్రకటన ద్వారా మీకు నోటీసు ఇవ్వబడుచున్నది.

క్ర. సం.	ఖాతా, రుణగ్రహీత(ల) & హామీదారు(ల) పేరు& చిరునామా	స్వాధీనం చేసుకొను సెక్యూరిటీ వివరాలు	డిమాండ్ నోటీసు తేది నాటికి పూర్తి బకాయి ప్లస్ తదుపరి వడ్డీ & ఇతర వ్యయాలు (రూ.లలో)
1	ఒంటిపులి కోదండ రాములు, ఒంటిపులి శ్రీను	డోర్ నెం. 4-7-43, అసిస్ట్ నెం.1027000488, రెవెన్యూ వార్డ్ 1, సత్తెనపల్లె గ్రామ డి.నెం.343/ఏ, ఫిరోజ్ మందిరం రోడ్, సత్తెనపల్లె మున్సిపల్ ఏరియా, సత్తెనపల్లె సబ్ జిల్లా, నరసరావుపేట రెవెన్యూ డివిజన్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-352240. సరిహద్దులు: తూర్పు:చల్లా శ్రీను ఆస్తి-33-6", దక్షిణం:చల్లా కొండల్లు ఆస్తి-21, పడమర: విజయ లక్ష్మి ఆస్తి-28-9", ఉత్తరం: బజార్ 17-6".	Rs. 706,082 /-
2	శేషెట్టి దుర్గారావు, శేషెట్టి జ్యోతి	ఫ్లాట్ నెం.204, మొదటి అంతస్తు, ఏ.ఎస్.ఆర్.ప్లాజా, ఆర్.ఎస్.నెం:18/1, 19/2సి, 19/2సి, ఫ్లాట్ నెం: 105, 105ఏ, 105బి, పాయకాపురం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్, కృష్ణా జిల్లా, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520015. సరిహద్దులు: ఉత్తరం: ఇతరుల స్థలం, దక్షిణం: 60"అ.ల వెడల్పు రోడ్డు, తూర్పు: 33" అ.ల వెడల్పు రోడ్డు, పడమర: ఇతరుల స్థలం.	Rs.1,806,902/-
3	కొండపల్లి వెంకటేశ్వర్లు, కొండపల్లి వరలక్ష్మి	డోర్ నెం.1-179, డి.నెం.406/2, గంగానమ్మ టెంపుల్ రోడ్, రామాలయం దగ్గర, నూతక్కి గ్రామం మరియు పంచాయతీ, మంగళగిరి మండలం, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522503. సరిహద్దులు: ఉత్తరం: ఉమ్మడి దారి, దక్షిణం: నూతక్కి సుబ్బారావు ఆస్తి, తూర్పు: నూతక్కి భాగ్యమ్మ ఆస్తి, పడమర: సాంబయ్య కొండపల్లి ఆస్తి.	Rs.1,266,301/-
4	ఇంటూరి జయ ప్రకాష్, జయ భారతి ఇంటూరి	డోర్ నెం.1-88, అసెస్‌మెంట్ నెం.88, సర్వే నెం.459-2బి, కమ్యూనిటీ హాల్ దగ్గర, ఆర్‌సిఎం చర్చి దగ్గర, దావాజిగూడెం, బుద్ధవరం గ్రామం మరియు పంచాయతీ, గన్నవరం మండలం, కృష్ణా, ఆంధ్రప్రదేశ్-521101. సరిహద్దులు: ఉత్తరం: చోరగుడి సురేష్ ఆస్తి, దక్షిణం: ఇందుపల్లి రవికుమార్ ఆస్తి, తూర్పు: తిరివీధి ప్రభు దాసు ఆస్తి, పడమర: రోడ్డు.	Rs.1,312,632/-

పై పేర్కొన్న మొత్తాలను వడ్డీ& ఖర్చులతో ఈనోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజుల కాలవ్యవధిలోగా **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్**కు చెల్లించవలసిందిగా ఇందుమూలంగా మిమ్మలను కోరబడుచున్నది, లేనిచో, ఏదైతే, రుణగ్రహీతలు, తాకట్టుదారులు మరియు హామీదారుల సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనంచేసు కొనుటతోసహా సెక్యూర్డ్ అసెట్స్ అన్ని లేదా ఏదేని ఒకటి లేదా మరిన్ని పై సదరు చట్టం యొక్క నియమాల క్రింద అవసరమైన చర్యను **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** తీసుకొంటుంది. దిగువ వాటితోపాటు **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్**కు అందుబాటులోగల అధికారాలు: (1) సెక్యూర్డ్ అసెట్స్‌రియలైజింగ్ కొరకు లీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం రూపేనా బదిలీచేయు అధికారలతో సహా రుణగ్రహీతలు/హామీదారుల సెక్యూర్డ్ అసెట్స్‌ను స్వాధీనంచేసుకొంటుంది (2) సెక్యూర్డ్ అసెట్స్ రియలైజింగ్ మరియులీజు, అసైన్‌మెంట్ లేదా అమ్మకం రూపేనా బదిలీచేయు అధికారాలతోసహా సెక్యూర్డ్ అసెట్స్ నిర్వహణ మరియు మీచే బదిలీచేయబడినట్లైతే బదిలీచేయబడిన సెక్యూర్డ్ అసెట్స్ రియలైజేషన్ మరియు అన్ని హక్కుల్లో రద్దుఅవుతాయి. సదరు చట్టంలోని సెక్షన్ 13(13) యొక్క నియమాలలో, మీరు **హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్** యొక్క ముందస్తు అనుమతి లేకుండా హోమ్ ఫైస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్‌కు హైపోతికేటెడ్/తనఖాపెట్టిన మరియు పై పేర్కొన్న సెక్యూర్డ్ అసెట్స్ ఏదేనినైనా అమ్మకం, లీజు లేదా ఇతర రూపాలు (మీ వ్యాపారంకు ఇతరత్రా)గా కాని బదిలీచేయుట నుండి మీరు నిషేధింపబడినారు.

ప్రదేశం: విజయవాడ
తేది: 09-09-2024

సం/- అధీకృత అధికారి,
హోమ్ ఫస్ట్ ఫైనాన్స్ కంపెనీ ఇండియా లిమిటెడ్



"అన్యాయాన్నెదిరిస్తే
నా గొడవకు సంతృప్తి
అన్యాయం అంతరిస్తే
నా గొడవకు ముక్తి ప్రాప్తి
అన్యాయాన్నెదిరించినోడు
నాకు ఆరాధ్యుడు "

- కాళోజీ



నక్షత్రాల నీడ పడని రాత్రి

చుక్కల ఒళ్ళో తలపెట్టి నిద్రపోతూ
మధ్య మధ్యలో వెక్కుతున్న చంద్రుడు
కాళ్ళతో నేలను దువ్వుతూ
సముద్రం ఇంకా రంకెలేస్తూనే వుంది
చెట్టు కాళ్ళకు ఆఖరిసారి దణ్ణం పెట్టుకొని
ప్రాణాలు విడుస్తున్న పువ్వులు
నీటిమీద పడవల్లా తేలుతున్నాయి

జోరు తగ్గని వరద
ఏ కనుపాపల పైనా నిద్రను వాలనివ్వడం లేదు
రేపటి మీద ఆశను వదిలేసుకున్న రైతు
వెనుదిరిగి వెళ్ళిపోయాక
వర్షం కూడా ఆత్మహత్య చేసుకుంది

తన చేత్తో తానే కళ్లు పొడుచుకున్న
మనిషొకడు
చీకట్లో చూపు కోసం ఒంటరిగా ఏడుస్తున్నాడు

ఆకాశం పిల్లలతో బంగారు గుడ్లు పెట్టే బాతు కథ
గుర్తుందా అని అడుగుతోంది

ఇంటి మధ్యలో
హఠాత్తుగా మొలిచిన నీటిచెట్టు
ఖాళీ చేసిన గదుల్లో
జ్ఞాపకాలు కొట్టుకుపోగా మిగిలిన శూన్యం
ఏ నక్షత్రాల నీడా పడని రాత్రి
చెంపలమీదుగా జారి గడ్డకట్టిన ప్రార్థన

ఉండుండి
ఒక ఉల్క రాలి
భూమిని మొత్తం కాంతితో నింపుతోంది!

– సా.మూ
9642732008

ఇంకా కొన్ని మిగిలే వున్నాయి

అప్పుడే కాసింత
విరామం దేహం కోరుకుంటోంది
అయినా ఇంకా తిరగాల్సినవి
కలవాల్సిన మనుషులు ఉన్నారు కదా
అయినా నువ్విక్కడితో
విరమించుకోవాలి అని కోరుతోంది

ఒక్కొక్కటీ వేరు పడుతున్నట్లుగా
ఒక్కటే సలపరం పాకుతోంది
దేహమంతా పసరిక పాములా
కానీ కాలి బొటన వేలితో
గురి చూస్తున్న ఆమెను చూసినప్పుడు
ఏదో జలదరింపు శరీరమంతా
చర్మం పొరలు గుండా
అందుకే ఇంకా కలవాల్సినవీ
తిరగాల్సినవీ మిగిలే ఉన్నాయి...

(శీతల్ దేవికి ప్రేమతో)
– కెక్యూబ్
94934 36277

అక్షర వ్యధలు



మాండలికాల మధ్య
వేయిన్నొక్క పాయలుగా
విడివడి నేనున్నా
అంతరించిపోతున్న
అక్షరమాలలో
అభ్యుదయమై గగ్గోలు
పెడుతున్నా
గాయపడినపుడు బాధతో
అరిచే
అమ్మ అనే మాట ఏ గట్టుదో ఏ పుట్టదో అని
కర్బన వయస్సు మాపన పరీక్షల్లో మునిగి తేలుతున్నా...
విరిగి పడి ఉన్న వాళ్ళం
నిటారుగా లేచి నిల్చోడానికి..
మనమంతా ముందుగా మనుషులమనే
ఊతకర్ర వాక్యాలను వెతుక్కుంటూ
నిలదొక్కుకోలేక నిట్టనిలువుగా కూలిపోతున్నా...
అక్షరాలను పుక్కిట పట్టీ పట్టీ ఊపిరి తీయలేక
నీవూ నేనుల మధ్య నాది నాదనే పదాలతో
నేలరాలుతున్నా...
ప్రాంతమేదైనా భావమర్థమయినపుడు
గుండె లోతు ఆర్ద్రతను కంటికెత్తుకునే
అక్షర కృతులను ముంచాలనే
తుపానులు తీరాలు దాటుతున్నపుడు...
నేలకొరుగుతున్న వ్రాతల చరితలనూ
తలచుకొంటూ... నెత్తికెత్తున్న ఏ కిరీటమైనా
కీర్తిశేషులైన అందరి మహనీయుల పుణ్య వచనాల
ఫలితమని మరచామా అని కన్నీరు పెడుతున్నా...
నేనెక్కడ అంటే ఏమని చెప్పేది
విడగొట్టబడిన సంధుల్లో ఆదేశమైన ఆవేశాన్ని!

– సుమన ప్రణవ్

ప్రకృతి మాట

అతి తెలివి మనిషి
అన్నీ చేసి నన్ను నిందిస్తాడు
నిష్కృతి లేని పాపం చేసి
ప్రకృతి ప్రకోప మంటూ
వికృత భాష్యం చెప్తాడు
అండగా నిలిచే బంగరు కొండల్ని దొలిచి
అడుగడుగునా ఎలుకల కలుగులు నిర్మిస్తాడు
కడుపు నింపే పచ్చని అడవులు కాల్చి
కాల్చుకు తినే ఎడారుల్ని పండిస్తాడు
నిండుకుండ చెరువులు పూడ్చి
ఇసుక మేడల్ని కట్టి పరవశిస్తాడు
గాలిని గౌరవించడు, కలుషితం చేస్తాడు
వాగుని లెక్కచేయడు, దారి లాక్కొంటాడు
చేతిలోని హరివిల్లును బుగ్గి చేసి
రంగుల భ్రమల్లో నివశిస్తాడు
భవితకు చీకటి మసి పూస్తాడు

మత్తు దులిపే విపత్తు వేళ
తన తప్పు మరిచి
వికృత భాష్యం చెప్తాడు
ప్రకృతిదే పాపమంటూ
పాత పాటే పాడతాడు!

– డా.డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ
94408 36931

దళిత సాహిత్య యోధుడు జాలా రంగస్వామి

పరిచయం

భారతదేశంలో ఆదిహిందూ, ఆది ఆంధ్ర ఉద్యమాలు సరికొత్త సామాజిక చైతన్యానికి బాటలు వేశాయి. నైజామాంధ్ర, బ్రిటీషాంధ్ర ప్రాంతాల అణగారిన ప్రజల్లో ఆత్మగౌరవ స్ఫూర్తిని కలిగించాయి. ఈవిధమైన ప్రత్యామ్నాయ కార్యాచరణకు భాగ్యరెడ్డి వర్మ మార్గదర్శిగా నిలిచాడు. జాతీయోద్యమంతో పాటు ఆది ఆంధ్ర ఉద్యమానికి కూడా రాజమహేంద్రవరం కేంద్ర బిందువుగా నిలిచింది. జాతీయోద్యమ సాహిత్యానికి ప్రేరణ నిచ్చిన 'భరత ఖండంబు చక్కని పాడియావు' పద్యం, ఆది ఆంధ్ర పోరాటానికి ప్రేరణ నిచ్చిన 'మాకొద్దీ నల్లదొరతనం' పాట ఈ నేల పైనే పల్లవించాయి. ఈ నదీ తీరంలో ఆది ఆంధ్రకవి, నాయకులు తమ బతుకు వెతలను వేదనతో భాషించారు. ఆది కర్తృత్వం వెల్లివిరిసిన ఇక్కడ ఆది ఆంధ్ర ఉద్యమ సాహిత్యం వర్ధిల్లిన ముచ్చట చరిత్ర పెద్దగా పట్టించుకోలేదు. 1917లో మరో మలుపు తిరిగిన ఆది ఆంధ్ర పోరాటం బెజవాడ నుంచి విజయనగరం వరకూ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో నలుమూలలకు విస్తరించింది. వేముల కూర్మయ్య, నరాలశెట్టి దేవేంద్రుడు, సుంద్రు వెంకయ్య, కుసుమ వెంకట రామయ్య, ఉంద్రు తాతయ్య, బి.యస్ మూర్తి, దిడ్ల పుల్లయ్య, బొజ్జ అప్పలస్వామి తదితర నాయకులు సమర్థవంతంగా ఈ ఉద్యమాన్ని నడిపించారు. విద్య, ఉద్యోగం, రాజకీయ ప్రాతినిధ్యం ప్రధాన లక్ష్యాలుగా ఆది ఆంధ్ర ఉద్యమం రాజమండ్రి ప్రాంతంలో ఉధృతంగా సాగింది. ఈ పట్టణాన్ని సందర్శించిన మహాత్మా గాంధీ, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ లాంటి ఎంతో మంది జాతీయ నాయకులు ఆది ఆంధ్ర నేతలను కలుసుకొని వారి కష్టనష్టాలను విచారించారు. మహాత్ములను సైతం మాల మాదిగ పల్లెలకు రప్పించిన ఆ గొప్ప నాయకులు కుసుమ ధర్మన్న, జాలా రంగాస్వామి. సివి మూలంగా ధర్మన్న చేసిన ప్రత్యామ్నాయ కృషి వెలుగులోకి వచ్చింది. దళిత వైతాళికుడైన కుసుమ ధర్మన్న సాహిత్య వ్యక్తిత్వంపై ప్రజాశక్తి బుక్ హౌస్ విలువైన పుస్తకాలను ప్రచురించింది. ధర్మన్న లాగానే సామాజిక, సాంస్కృతిక, సాహిత్య రంగాల్లో బహుముఖీనమైన కృషి చేసిన ఆది ఆంధ్ర ఉద్యమ సారథి, సాహితీవేత్త జాలా రంగస్వామి గురించి ఇంతవరకూ చర్చ జరగలేదు. పేరును ప్రస్తావించారు గానీ రంగస్వామి సాహిత్య తీరు తెన్నులపై సరైన విశ్లేషణ చేయలేదు. బి.ఎస్.మూర్తి అన్నట్లు 'దళిత జనోద్ధరణకు తన జీవితాన్ని కైంకర్యం చేసిన మహానుభావుడు రంగస్వామి'. ప్రౌఢబంధురమైన పద్యం రాసే సృజనశక్తి ఉన్నప్పటికీ ఆ ధోరణికి భిన్నంగా రంగస్వామి తన జాతి జనుల అవగాహనను అనుసరించి వచన ప్రక్రియల వైపు ఎక్కువగా దృష్టి సారించి చైతన్యభరితమైన దళిత సాహిత్యాన్ని సృష్టించాడు.

జాలా రంగాస్వామి 1904లో పేరమ్మ, కుప్పుస్వామి దంపతులకు రాజమండ్రి పట్టణం కంబాల పేటలో జన్మించాడు. ఉపాధ్యాయుడిగా ఒకవైపు పాఠాలు బోధిస్తూనే మరొక వైపు ఆది ఆంధ్ర ఉద్యమ నాయకుడిగా, అంటరాని చీకటిలో మగ్గుతున్న అణగారిన ప్రజల్లో నూతన



సంస్కరణ జ్యోతులు వెలిగించాడు. సామాజిక కార్యకర్తగా, దళిత నేతగా మాల మాదిగలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజీలేని పోరాటం చేశాడు. పశ్చిమ గోదావరి జిల్లా చాగల్లులో మహాత్మాగాంధి స్థాపించిన ఆనంద నికేతన్ ఆశ్రమంలో ఉపాధ్యాయుడిగా ఆయన విశేష సేవలందించాడు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నందుకు జైలు శిక్ష అనుభవించిన దేశభక్తుడు జాలా రంగస్వామి. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా, దళితుల్లో జ్ఞాన ఎరుకను పెంపొందింపజేసిన సంస్కరణ శీలి. మాల మాదిగల విద్యార్థుల కోసం ఉచితంగా వసతి గృహాలు స్థాపించాడు. ఇందుకోసం భిక్షాటన చేశాడు. ఆది ఆంధ్ర ఉద్యమకారుడిగా, రచయితగా జాలా రంగస్వామి చారిత్రాత్మకమైన కృషి చేశాడు. జైభీమ్, వీర భారతి వంటి పత్రికలను ప్రారంభించి తద్వారా ఉద్యమ భావజాల ప్రచారం సాగించాడు. గేయం, పద్యం, నవల, నాటకం, జీవిత చరిత్ర తదితర ప్రక్రియల్లో ఇరవై గ్రంథాలు రచించినప్పటికీ జాలా రంగాస్వామికి తెలుగు సాహిత్యం చరిత్రలో సముచిత స్థానం దక్కకపోవటం విచారకరం. 'అంటరాని వారెవరు?', 'మాల శుద్ధి', 'మేలుకొలుపు' లాంటి గేయాలతో ఆయన దళిత జాతిని మేలుకొల్పాడు. అరుంధతి, అహింసా, అస్పృశ్యత, కడుపు మంట, నిరుద్యోగి లాంటి ఎన్నో ప్రయోజనవంతమైన రచనలు చేశాడు. జంగం చిన్నయ్య 'భారతదేశ నిర్మాణంలో దళితులు', యాగాటి చిన్నారావు 'ఆంధ్రప్రదేశ్ దళిత ఉద్యమ చరిత్ర' వంటి పరిశోధకుల గ్రంథాల్లో జాలా రంగ స్వామి సేవలను కొనియాడారు. ఎల్లే విజయానందరాజు తన సిద్ధాంత గ్రంథంలో రంగస్వామి రాసిన కొన్ని రచనలను సమీక్షించాడు.

పాట, వచన గేయం, నాటకం లాంటి ప్రక్రియల ద్వారా అత్యధిక శాతం నిరక్షరాస్యులైన దళితులను చైతన్యవంతం చేయవచ్చునని జాలా రంగా స్వామి భావించాడు. 'అంటరానివారెవరు? అనే దీర్ఘ గేయం దళిత సాహిత్యానికి గొప్ప స్ఫూర్తినిచ్చింది. 'ప్రస్తుత మాల మాదిగల స్థితి', 'కవి జీవించినకాలం', 'పూర్వోన్నత స్థితి', 'విచారణ' మూడు భాగాలుగా రంగస్వామి ఈ గేయాన్ని రచించాడు. ఆనాటి మాల మాదిగల దీనావస్థలను, అంతకముందు రాజులుగా, నాయకులుగా రాజ్యాలను పాలించిన దళితుల ఉన్నత స్థితి గతులను రంగస్వామి చారిత్రిక దృష్టితో ఈ గేయంలో చిత్రించాడు. 'కుక్కల కన్నా తక్కువంచు మము ఎక్కిరించుతారే / చక్కని పంటలు పండిస్తేను చల్లగా తింటారే/ వీటన్నిటిని ముట్టిన వారికి వెగటే లేదండీ/ మమ్ముల ముట్టగా మాత్రము వారికి వెగటు బుట్టెనండి' అని ఆధిపత్య వాదుల గుండెలదిరేలా గర్జించాడు. కుల వ్యవస్థలోని అవకాశవాద వైఖరిని, ద్వంద్వ ప్రవృత్తిని రంగాస్వామి పదునైన వాదనా పటిమతో ఎత్తి చూపాడు. 'ఆది ఆంధ్రుల రక్తమునంతా ఆరగించినా మీకు దాహము తీరలేదా? మా యొక్క కష్టమ్మును దింటూ మమ్ము జంపుతారే' అని తీవ్రంగా ప్రశ్నించాడు. అంటరాని తనం పేరుతో కోట్లాది ప్రజలను విడదీసి మాట్లాడితే హిందూ జాతికి బలం లేదని తేల్చి చెప్పాడు. 'ఆర్యుల కంటే ముందటి వారు అనార్యులేనండి/ చరిత్రలెల్ల చెప్పుచున్నవి చక్కగా వినరండి / పూర్వము రాజ్యాలేలిన వీర పురుషులు మావారు' మూల వాసులైన మాలమాదిగలే ఒకప్పుడు భారతదేశాన్ని పాలించారని, వారిపై ఆర్యులు దాడి చేసి రాజ్యాన్ని ఆక్రమించారని రంగాస్వామి ఈ గేయంలో విశ్లేషించాడు. ఆర్య వలస వాదుల, దోపిడీదారుల అసలు రహస్యాలను కుసుమ ధర్మన్నలాగా రంగాస్వామి తేటతెల్లం చేశాడు. సవర్ణుల చేత ఆరాధించబడే పురాణ పురుషులు వాల్మీకి, వేదవ్యాసుడు, కన్నమనీడు, రోహిదాసుడు, చొకామేలుడు లాటి భక్తులందరూ శూద్రులేనని గుర్తుజేశాడు. 'మీ తల్లికి మీరెట్లు పుట్టిరో మేము అట్లేనయ్య', 'సోదరత్వము జూపుటలోనే సుఖమున్నాదండి' అని ప్రాబల్య వర్గాల వారికి హితవు చెప్పాడు. అంటరానితనం రూపు మాపకుండా 'సర్వేజనా స్సుఖినోభవన్తు' అనే నినాదానికి అర్థం లేదని కవి పరోక్షంగా విమర్శించాడు. 'అమానుషమైన భేదభావాలతో ఈ ధర్మ రాజ్యాన్ని పాడుచేయకండి' అని హెచ్చరించాడు. స్వరాజ్య సాధనతో పాటు సాంఘిక సమానత్వ సాధన కూడా ముఖ్యమని' 'అంటరాని వారెవరు?' గేయంలో కవి దార్శనిక దృష్టితో ప్రస్తావించాడు.

జీవ కారుణ్య భావనను, జంతు సంరక్షణ ఆవశ్యకతను తెలియజేస్తూ జాల రంగాస్వామి 'అహింస' పాటల సంపుటి వెలువరించాడు. పశువుల మొర, మేకల మొర, గొర్రెల మొర, కోళ్ళ మొర, చేపల మొర వంటి శీర్షికలతో అందరికీ అర్థమయ్యే శైలిలో రంగ స్వామి రాసిన ఈ పాటల సంపుటి పశువులను ఎంత ప్రేమగా ఆదరించాలో తెలియజేస్తుంది. 1915లో 'జీవరక్షా జ్ఞాన ప్రచారక మండలి, దక్కన్ హ్యూమానిటేరియన్ లీగ్ సంస్థల ద్వారా భాగ్యరెడ్డి వర్మ జీవ కారుణ్య తత్వాన్ని విస్తృతంగా ప్రచారం చేశాడు. ఈ సంస్థ 'అహింసా సంగీత రత్నావళి' పేరుతో పాటల పుస్తకాన్ని ప్రచురించింది. భూత దయాదృష్టిని తెలియజెప్పే అనేక పాటలు ఈ పుస్తకంలో ఉన్నాయి. జీవరక్షా జ్ఞానప్రచార మండలి విశేష కృషిని 'అహింస' గ్రంథం ముందు మాటలో విశ్వనాథ్ టేకుమళ్ళ ప్రస్తావించాడు. బౌద్ధ, జైన మతాలు తప్ప మిగతా మతాలు జీవహింసను వ్యతిరేకించడం లేదని ఈ ముందుమాటలో విశ్వనాథ్ ఆరోపించాడు. 'అడవుల్లో పులుల బాధ, జనావాసాల్లో పురజనుల బాధ, మాకు బాధ యెటుల తప్పదయ్య' జంతువుల మొరను, ఆవేదనను రంగస్వామి తన పాటల్లో ఆర్ద్రంగా అక్షరబద్ధం చేశాడు. 'జీవహింసయని దలచు వారు, ప్రేమ జూపించు మానవులు మాయమైనారయ్య' అని రంగస్వామి ఆవేదన వ్యక్తం చేశాడు. 'అన్న దానములెన్నో హాయిగా జరుపేరు/ ధర్మసత్రాలు నిర్మింత్రు చాలా/ పుణ్యక్షేత్రాలు తిరుగుదురేల/ గొప్పలెన్నో జెప్పుచు దిరిగి, గోసి మము తినునేల' ఇలాంటి ప్రశ్నలతో కవి జంతువుల మొరను పాటల్లో పలికించి మానవజాతికి కనువిప్పు కలిగించాడు. 'మాలో మాకు కయ్యాలు పెంచేరు/ పందెములు వేసి మమ్ము జంపేరు/ దీనికై డబ్బులు పోసి చెడతారు' భక్తి పేరుతో సాగే జంతు బలులను, పౌరుషం కొరకు చేసే కోడిపందెములను ఈ పాటల్లో కవి తీవ్రంగా నిరసించాడు.

జాలా రంగస్వామి గొప్ప నాటక కర్త. ఆది ఆంధ్ర, హరిజనోద్యమాల ఆశయాలను ప్రచారం చేస్తూ ఈ రచయిత మంచి నాటకాలు రాశాడు. అయితే ఎక్కువసార్లు ప్రదర్శించక పోవడం వల్ల ఈ నాటకాలకు పెద్దగా ప్రాచుర్యం లభించలేదు. రాజమండ్రిలో పౌరాణిక నాటకాల హవా కొనసాగుతున్న కాలంలో రంగా స్వామి సాంఘిక నాటకాల ద్వారా సామాజిక చేతన రగిలించాడు. దళితులకు దేవాలయ ప్రవేశం కల్పించాల్సిన అవసరాన్ని చాటి చెబుతూ 'నందనార్' (1937) నాటకం రాశాడు. దళిత స్త్రీలపై భూస్వాములు సాగించే హింసాకాండను, అకృత్యాలను కళ్ళకు కట్టినట్లు 'అనాథ', (1947) నాటకంలో చిత్రించాడు. ఉద్యోగం చేస్తున్నప్పటికీ ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న ఉపాధ్యాయుల బాధలను రంగస్వామి 'బడిపంతులు బ్రతుకు' (1953) నాటకంలో సజీవంగా దృశ్యమానం చేశాడు. బంజరు భూములను, నివాసయోగ్యమైన స్థలాలను ప్రభుత్వమే దళితులకు పట్టాల రూపంలో పంచిపెట్టాలని, దేశ రాజకీయాల్లో దళితులు పాలు పంచుకోవాలనే సందేశంతో 'దున్నేవానిదే భూమి' అనే 15 రంగాల నాటకం రాశాడు. పాము పడగ కింద కప్ప నివసించడం ఎలా ఉంటుందో దళితుల బతుకు కూడా గ్రామాధికారుల పాలన కింద అలాగే ఉందని పుల్లయ్య అనే దళిత నాయకుడి పాత్ర ద్వారా పలికిస్తాడు రచయిత. దళితులు విద్యావంతులై ఎన్నికల్లో పోటీ చేసి మంత్రులై దేశసేవలో ముందుండాలని రంగస్వామి ఈ నాటకం ద్వారా చాటి చెప్పాడు. 'రంగస్వామి నాటకాల్లో సంభాషణ తీవ్ర గతి నడుస్తుంది. పద్యములలోని భావములు ఆలుచిప్పలోని ఆణిముత్యాల్లా ప్రకాశిస్తాయి' అని డి.రామయ్య ప్రశంసించాడు. కులాంతర వివాహాల ఆవశ్యకతను తెలియజేస్తూ రంగాస్వామి వెలువరించిన 'రైతుపిల్ల' (1938) నవల విశిష్టమైనది. తెలుగు విశ్వవిద్యాలయంలో ఎండ్లూరి సుధాకర్ పర్యవేక్షణలో గూటం లక్ష్మణ రావు 'రైతు పిల్ల నవల – ఒక పరిశీలన' అనే అంశంపై ఎంఫిల్ చేశాడు. కమ్యూనిస్టు నాయకుడు చిట్టూరి ప్రభాకర చౌదరి కుసుమ ధర్మన్న కుమార్తెను వివాహం చేసుకున్న సందర్భంలో ఈ ఆదర్శ వివాహం ప్రేరణగా రాసిన ఈ నవలను రంగస్వామి ఒక సాంఘిక ఇతిహాసం లాగా తీర్చిదిద్దాడు. ఆనాటి గ్రామీణ ఆర్థిక రాజకీయ పరిస్థితులను, రైతు కూలీల నడుమ సాగే సంఘర్షణను, కాంగ్రెస్ పార్టీ విధానాలను నవలలో రచయిత ఆసక్తిదాయకంగా చిత్రించాడు. కల్లు, మద్యపానము లాంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, శారీరక పరిశుభ్రతను విధిగా పాటించాలని, వేషధారణలో కూడా జాగ్రత్త వహించాలని 'మాలశుద్ధి' గేయంలో రంగాస్వామి దళితులకు హితబోధ చేశాడు. కష్టజీవులైన దళితులు కూలి డబ్బులను పొదుపు చేసుకోవాలని, మూఢాచారాలను విడిచి పెట్టాలని దళిత స్త్రీలకు సూచించాడు. 'మధుపిశాచి', 'త్రాగుబోతు మగడు' లాంటి రచనలతో దళితుల ఆరోగ్య సంరక్షణకు జీవన భద్రతకు అవసరమైన సదావగాహన కల్పించాడు. జాలా రంగస్వామి ఉద్యమ, సాహిత్య ప్రయాణంలో ఆయన సహచరి, రచయిత్రి, ఉత్తమ ఉపాధ్యాయురాలు, నాయకురాలు, జాలా మంగమ్మ పాత్ర మరువలేనిది. ఆది ఆంధ్రుల సంస్కరణలో, భర్త కార్యాచరణలో మంగమ్మ సగభాగమై రంగస్వామిని ముందుకు నడిపించింది. ఆది జన గ్రంథమండలి స్థాపించి రంగస్వామి రచనలకు సంపాదకత్వం వహించి వాటిని ప్రచురించింది. మంగమ్మ మొదటి దళిత సంపాదకురాలని జయధీర్ తిరుమలరావు పేర్కొన్నాడు. కుసుమ ధర్మన్న, గుర్రం జాషువ, బోయి భీమన్న తదితర కవుల ప్రభావం జాలా రంగస్వామి సాహిత్యంపై కొంతవరకు కనిపిస్తుంది. వీరందరూ పరస్పరం స్ఫూర్తి పొందుతూ ముందుకు సాగారు.

మహాత్మాగాంధీ కృషి వల్లనే దళితుల జీవితాల్లో మంచి మార్పులు వచ్చాయని జాలా రంగస్వామి భావించాడు. పరిణామక్రమంలో ఆయన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను నిబద్ధతతో అనుసరించాడు. భారతదేశ ప్రగతికి, అణగారిన వర్గాల సర్వతోముఖ విముక్తికి మార్గదర్శకమైన ప్రణాళికను అందించిన అంబేద్కర్ ప్రస్థానాన్ని జాలా రంగస్వామి తన గ్రంథాల్లో తెలియజేశాడు. 'ఆరని అమర జ్యోతి అంబేద్కర్', 'అంబేద్కర్ రాయబార సందేశ జీవితం' లాంటి గ్రంథాలతో తెలుగులో అంబేద్కర్ సాహిత్యానికి రంగస్వామి అంకురార్పణ చేశాడు. పద్యమైనా, వచనమైనా పూర్తిగా వ్యవహారిక భాషలో రాయడం వల్ల సామాన్యులకు కూడా రంగా స్వామి సాహిత్యం అర్థమవుతుంది. కుసుమ ధర్మన్న లాగా రంగస్వామి కూడా దళిత సాహిత్యయోధుడు. జాలా రంగస్వామి సమగ్ర సాహిత్యంపై పరిశోధనలు జరగవల్సిన అవసరముంది.

– డాక్టర్ కోయి కోటేశ్వరరావు
94404 80274

అకాడెమీలను స్వతంత్ర సంస్థలుగా నిలపాలి

సూచన

మన దేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత జాతీయ సమైక్యతా దృక్పథంతో, విభిన్న భాషా సాహిత్యాల అభివృద్ధి కోసం, విభిన్న భాషల మధ్య భావసమన్వయం కోసం భారత ప్రభుత్వం సాహిత్య అకాడమీని 1954లో స్థాపించింది. దానిని మనం కేంద్ర సాహిత్య అకాడమీ అని పిలుచుకుంటూ ఉన్నాం. భారతదేశంలోని విభిన్న రాష్ట్రాలు తమ కళా భాషా సాహిత్యాల అభివృద్ధి కోసం అనేక అకాడమీలను స్థాపించు కున్నాయి. అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌లో కూడా అనేక అకాడమీలు స్థాపింపబడ్డాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడి నప్పటి నుంచి 1983 దాకా ఆ అకాడమీలు క్రియాశీలంగా పనిచేశాయి. అయితే ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించి 1983లో అధికారంలోకి వచ్చిన తర్వాత, అప్పటిదాకా అమలులో ఉన్న అనేక వ్యవస్థలను రద్దు చేసి, ప్రత్యామ్నాయ వ్యవస్థలను సృష్టించారు .అందులో భాగంగాఅప్పుడు ఉన్నటువంటి అనేక అకాడమీలను రద్దు చేశారు. వాటికి ప్రత్యామ్నాయంగా తెలుగు విశ్వవిద్యాలయం అనే సంస్థను స్థాపించారు. తెలుగు విశ్వవిద్యాలయాన్ని మనం ఏమాత్రం తక్కువ చేసి మాట్లాడకుండానే అకాడమీలకు విశ్వవిద్యాలయం సరైన ప్రత్యామ్నాయం కాదని ఆమోదించాలి. 2004లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చింది.

ఆ సమయంలో రాష్ట్ర అకాడమీలను పునరుద్ధరించే ప్రయత్నాలు కొన్ని జరిగాయి. కానీ అవి కార్యరూపం ధరించలేదు. 2014లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెండు రాష్ట్రాలుగా విభజింపబడింది. తెలంగాణకు కె.చంద్రశేఖరరావు, ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రులయ్యారు. ఆ విభజన జరిగిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ సాహిత్య అకాడమీని, మరికొన్ని అకాడమీలను ఏర్పాటు చేసింది. ఆ అకాడమీలు చాలా చురుకుగా పనిచేస్తున్నాయి. ప్రపంచ తెలుగు మహాసభలను కూడా దిగ్విజయంగా నిర్వహించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణం చేసే క్రమంలో చాలా ఆలస్యంగా, బహుశా 2018లో కొన్ని అకాడమీలను ప్రకటించింది. కానీ అవి క్రియాశీలంగా పనిచేయలేదు. 2019లో వైయస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడు అకాడమీలను ప్రకటించింది. అవి కూడా క్రియాశీలంగా పనిచేయలేదు. ఇప్పుడు చంద్రబాబు ముఖ్యమంత్రిత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. అనేక కార్పొరేషన్లకు, అనేక సంస్థలకు అధ్యక్షులను, డైరెక్టర్లను నియమిస్తున్నది. బహుశా ఆ క్రమంలో అకాడమీలను కూడా పునరుద్ధరిస్తూ కార్యవర్గాల పునర్నిర్మాణం చేస్తుందని భాష కళ వైజ్ఞానిక రంగాలకు చెందిన వారు భావిస్తున్నారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం దష్టికి కొన్ని విషయాలను తీసుకుపోవడం నా ఉద్దేశం. జాతీయ స్థాయి అకాడమీలు గాని, రాష్ట్రస్థాయి అకాడమీలు గాని– అవి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నెలకొల్పినవే. సందేహం లేదు. అవి రాజ్యాంగానికి లోబడిన సంస్థలే. కానీ మిగతా కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థలకు, అకాడమీలకు మధ్య ఒక తేడా ఉంది. అకాడమీలు స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలు. ప్రభుత్వం అకాడమీలను స్థాపించి వనరులను, సదుపాయాలను కల్పించి వదిలేయాలి. అకాడమీలను ఆయా రంగాల్లో నిష్ణాతులైన ప్రతినిధులు నడుపుకుంటారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి అకాడమీలు రాజకీయ నిర్ణయాల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండకూడదు. అందువల్ల ఇప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అన్ని అకాడమీలకు అధ్యక్ష ఉపాధ్యక్షులను, కార్యవర్గ సభ్యులను నియమించి అకాడమీల పనిని ప్రారంభించాలి. కొత్తగా నియమింపబడిన కార్యవర్గం అకాడమీలను స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలుగా కొనసాగడానికి అవసరమైన నియమ నిబంధనలను, విధివిధానాలను రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలి. ప్రభుత్వం ఆ ప్రతిపాదనలను ఆమోదించాలి .ఆ తర్వాత రాజకీయ మార్పులతో సంబంధం లేకుండా అకాడమీలు కొనసాగాలి. పని చేయాలి. అకాడమీలు రాజకీయవాదులకు ఆవాస కేంద్రాలు లేదా పునరావాస కేంద్రాలు కాకూడదు. అవి కళా వైజ్ఞానిక రంగాలు. వాటి మానాన అవి పని చేయాలి. అటువంటి వాతావరణాన్ని ఇప్పటి రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలి. ఈ విషయంలో అవసరమైతే కర్ణాటక, తమిళనాడు, కేరళ వంటి ఇతర దక్షిణ భారత రాష్ట్రాలలో అకాడమీలు పనిచేస్తున్న తీరును పరిశీలించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిపుణుల కమిటీని నియమించి, ఆ కమిటీ నివేదికను అధ్యయనం చేసి అమలు చేయవచ్చు. గతంలో అకాడమీలు స్థాపింపబడినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అధ్యక్ష ఉపాధ్యక్షులను, కార్యవర్గ సభ్యులను నియమించింది. ప్రభుత్వ ఉద్యోగుల నుంచి కార్యదర్శిని, కార్యాలయం సిబ్బందిని నియమించింది. ఆ తర్వాత అకాడమీలలో నమోదైన సభ్యులు అధ్యక్ష ఉపాధ్యక్షులను కార్యవర్గ సభ్యులను ఎన్నికలలో ఎన్నుకున్నారు. అది ఇప్పుడు మళ్ళీ మొదలవ్వాలి. ఇదొక ప్రజాస్వామిక ప్రక్రియ. కారణాలు ఏవైనా ఆంధ్రప్రదేశ్‌లో అకాడమీల విషయంలో ఆ ప్రజాస్వామ్య ప్రక్రియ చితికి పోయింది. ఇప్పుడైనా ఆ ప్రక్రియను పునరుద్ధరించాలి. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించే అకాడమీల బాధ్యులు ఆ ప్రజాస్వామిక ప్రక్రియను అమలులోకి తీసుకొని రావడానికి కృషి చేయాలి. ప్రభుత్వం అందుకు సహకరించాలి. అవసరమైతే ఒకేసారి అధ్యక్ష ఉపాధ్యక్షులను కార్యవర్గ సభ్యులను నియమించకుండా, ఒక్కొక్క అకాడమీకి ఒక్కొక్క ప్రత్యేక అధికారిని (స్పెషల్ ఆఫీసర్)ను నియమించి ఆ ఆఫీసర్‌కి సహాయకులుగా ఇద్దరు సభ్యులను నియమించి అకాడమీల పని విధానాన్ని, నిర్మాణ వ్యవస్థను సూచించమని కోరవచ్చు. మొదట అకాడమీల జనరల్ బాడీ సభ్యులు నమోదు కావాలి. అకాడమీలలో సభ్యులుగా ఉండడానికి అర్హతలు నిర్ణయించాలి.

साहित्य अकादेमी
Sahitya Akademi

గతంలో ఉండిన అకాడమీల చట్టాలను సంపాదించి వాటికి మార్పులు చేర్పులు చేసుకోవచ్చు. జనరల్ బాడీ సభ్యులు ఎన్నికల ద్వారా అధ్యక్ష ఉపాధ్యక్షులను కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవాలి. ఒకసారి ఎన్నికైన కార్యవర్గానికి కాల పరిమితిని నిర్ణయించాలి.

కేంద్ర సాహిత్య అకాడమీలో కొత్తగా ఏర్పడే జనరల్ కౌన్సిల్, సలహా మండలి ఐదు సంవత్సరాలు పరిమితిగా పెట్టుకొని పని చేస్తున్నాయి. రాష్ట్ర అకాడమీలు కూడా అదే పద్ధతిలో ఐదు సంవత్సరాల కాల పరిమితిని పెట్టుకోవచ్చు. గతంలో రాష్ట్ర అకాడమీలలో భాగస్వాములైన వారు కొందరు ఇంకా మిగిలి ఉన్నారు. వాళ్ళ సలహాలను తీసుకోవచ్చు. ప్రభుత్వం కార్యదర్శిని కార్యాలయ సిబ్బందిని నియమించాలి. భవన సౌకర్యం కల్పించాలి. నిధులు సమకూర్చాలి. కొత్తగా ఎన్నికైన కార్యవర్గం ప్రతి ఏడాది ప్రారంభంలో ఆ ఏడాదిలో తాము నిర్వహింపదల్చుకున్న కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందించుకొని అమలు చేయాలి. గతంలో అకాడమీలు నిర్వహించిన కార్యక్రమాలను పరిశీలించి ఇప్పటి పరిస్థితులకు అనుగుణంగా రూపకల్పన చేసుకోవాలి. అకాడమీలు స్థిరమైన అజెండాతో, కృతనిశ్చయంతో, నిబద్ధతతో పనిచేయాలి. రాష్ట్రంలో కళా వైజ్ఞానిక వికాసానికి అకాడమీలు ఇరుసులుగా పని చేయాలి. అకాడమీలు తాత్కాలిక కేంద్రాలుగా కాకుండా శాశ్వత సంస్థలుగా అవిచ్ఛిన్నంగా పనిచేయాలి. అకాడమీ బాధ్యులను తొలిసారి ప్రభుత్వం నియమించిన తర్వాత ఎన్నికల ద్వారా ఆ బాధ్యులను ఎన్నుకొని పనిచేయాలి. అందులో సామాజిక న్యాయం ఉండాలని ప్రత్యేకంగా చెప్పవలసిన అవసరం లేదు. సామాజిక న్యాయమే ప్రజాస్వామ్యం. కార్యవర్గ నిర్మాణంలోను, కార్యక్రమ ప్రణాళికలలోనూ సామాజిక న్యాయం ఉట్టిపడాలి. ఆంధ్రప్రదేశ్‌లోని విభిన్న అకాడమీలు ప్రజాస్వామిక సంస్థలు అని అందరూ గుర్తుపెట్టుకోవాలి.

– రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
94402 22117

నువ్వూ నేనూ ఒకటి కాదూ..?

వేళ్ళుగా విడివడి, పిడికిలై నినదిద్దామని కదా
మనమానాడు అనుకున్నది,
నువ్వు బిగించే పిడికిలి వ్రేళ్ళనీ,
తీగల్లా బిగుసుకునే నరాల్నీ అడుగు
నరాల్లో ప్రవహించే నెత్తుటి సంగీతం విను
చేయి నీదే కాదు.. నాది కూడా
నాది నాదే, నీది నీదే అంటే కుదరదు!

పిడికిళ్ళెత్తిన ఆనాటి చెలిమి పిలుపు
ఏమయ్యింది తమ్ముడా?
ఏరూ మనదే, పడవా మనదే
ఇద్దరమూ చేరేది ఒకే ఒడ్డుకి
అలలు ఒక్కో రేవులో ఒక్కో పాట పాడవు
ఏటిపాట ఎక్కడైనా ఒకటే!
ఏరుదాటేక పడవ ఓటిదైందా?
మల్లన్న బోడిమల్లన్నై పోయేడా?
మన దాహం తీరేది ఆ నీటితోనే కదా
నీటి రుచిలో తేడా ఏముందని?
నీ నీరు నీదే, నా నీరు నాదే అని ఎంత తేలిగ్గా అనీసేవు!

ఒక చెట్టుకి రెండు కొమ్మలం కదా!
ఒక కొమ్మకి రెండు పువ్వులం కదా!
మకరందం మాధుర్యంలో తేడా ఎలా వస్తుంది?
ఒకే నేలసారం పీల్చుకుని ఎదిగిన చెట్టుకి
ఒక పండు తీపీ, మరో పండు చేదు అంటే
ఎలా సోదరా?
'నీ తీపి నీదే నా తీపి నాదే' అని ఎలా
అనగలుగుతున్నావో?
విడికొమ్మలే అయినా చెట్టునే అంటిపెట్టుకోవాలి
చెట్టు నేలనే నమ్ముకోవాలి
కొమ్మల నడుమ వివక్షేమిటి?
చెట్టుకి పక్షపాతం ఉంటుందా ?

జంటకొమ్మలం మనం
నువ్వొకవేపు వొంగినా, నేనొక వేపు వొరిగినా
మన చేతులు జోడించాల్సింది వేళ్ళకే!
నీ వేళ్ళు నీవే, నా వేళ్ళు నావే అంటే నవ్వుకుంటాయవి!

నేలలోంచి.. వేళ్ళలోంచి అందాల్సిన సారంలో
హెచ్చుతగ్గుల గురించి మాట్లాడుకోవడం తప్పు
కాకపోవొచ్చు
అమ్మ మీద అలగని పిల్లాడుంటాడా?
అలగడం మన హక్కు
అదే సమయంలో మనమొకటి కాదనడమే చిక్కు
నువ్వు నువ్వే.. నేను నేనే కాదు
నువ్వూ నేనూ రెండు మూర్తులం కావొచ్చు
సారంలో ఒకటే ..!

– లాంగుల్య

నిర్దోషులే అత్యధికం

- యుఎపిఎ కేసుల్లో రుజువుకాని నేరారోపణలు
- 2014-2022 మధ్య 8,719 కేసులు
- 215 మంది దోషులు, 567 మంది నిర్దోషులు
- కేంద్ర ప్రభుత్వ డేటా వెల్లడి
- తప్పుడు కేసులు పెడుతున్నారని ప్రతిపక్షాల విమర్శ

ఆందోళనకు గురిచేస్తున్న యుఎపిఎ

ఏడాది	మొత్తం కేసులు	దోషులు	నిర్దోషులు
2014	976	9	24
2015	897	11	65
2016	798	11	22
2017	901	34	33
2018	1,182	27	68
2019	1,126	33	64
2020	1,007	27	99
2021	905	27	39
2022	927	36	153

8,719 యుఎపిఎ కింద 2014-2022 వరకు నమోదైన కేసులు

567 నిర్దోషులు

215 దోషులుగా నిర్ధారణ అయిన కేసులు



2021 39 కేసుల్లో 27 మంది నిర్దోషులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కఠినమైన ఉగ్రవాద నిరోధక చట్టం (యుఎపిఎ) కింద నమోదైన కేసుల్లో నేరారోపణలు రుజువు కావడం లేదు. వాటిని రుజువు చేయడం లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు కష్టంగా మారిందని కేంద్రప్రభుత్వం రూపొందించిన డేటా స్పష్టం చేస్తోంది. కేంద్రప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతున్నందు వల్లే ఈ దుస్థితి ఏర్పడిందని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. 2014 నుంచి 2022 వరకు యుఎపిఎ కింద మొత్తం 8,719 కేసులు నమోదయ్యాయి. వీటిలో 567 కేసులలో నిందితులు నిర్దోషులుగా తేలింది. 215 కేసులలోనే నిందితులు దోషులుగా తేలింది.

డేటా ప్రకారం.. 2014లో 976 కేసులు నమోదయ్యాయి. ఆ సంవత్సరం తొమ్మిది మంది మాత్రమే దోషులుగా నిర్ధారణ అయ్యింది. 24 కేసులలో నిందితులు నిర్దోషులుగా తేలింది. ఏటా దాదాపు ఇదే పరిస్థితి కొనసాగింది. 2015లో వివిధ పోలీసు బలగాలు, కేంద్ర ఏజెన్సీలు, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో యుఎపిఎ కింద 897 కేసులు నమోదయ్యాయి. 11 కేసుల్లో నేరారోపణలు నమోదవగా, 65 కేసుల్లో నిందితులు నిర్దోషులుగా విడుదలయ్యారు.

2016లో 11 కేసుల్లోనే నేరారోపణలు నమోదయ్యాయి. 22 కేసుల్లో నిర్దోషులుగా విడుదలయ్యారు. 2017 సంవత్సరంలో నిందితులు 34 మంది కాగా, 33 నిర్దోషులుగా విడుదలయ్యారు. దేశవ్యాప్తంగా 901 కేసులు నమోదు చేయబడ్డాయి. 2018, 2019లో వరుసగా.. 1,182 కేసులు, 1,226 కేసులు నమోదయ్యాయి. 2018లో 68 కేసుల్లోనూ, 2019లో 64 కేసుల్లోనూ నిందితులను కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది.

2020లో నిర్దోషుల సంఖ్య 99కి పెరిగింది. నేరారోపణలు 27కి తగ్గాయి. 2021లో 39 మంది నిర్దోషులుగా, 27 కేసులలో నేరారోపణలు కొనసాగాయి. 2022 సంవత్సరంలో అత్యధికంగా 153 మంది నిర్దోషులుగా ఉన్నారు.

ఆ సంవత్సరం కేవలం 36 నేరారోపణలు మాత్రమే నమోదయ్యాయి. యుఎపిఎ కింద కేసుల్లో నేరారోపణలు రుజువు చేయడం కష్టసాధ్యంగా ఉందని, అటువంటి కేసులలో దర్యాప్తును నిర్వహించడంలో విపరీతమైన సంక్లిష్టత ఎదురవుతోందని, దీనికి ఉన్నత స్థాయి వృత్తి నైపుణ్యం అవసరమని భద్రతా నిపుణులు చెబుతున్నారు. ప్రతిపక్షాలపై కక్షసాధింపు చర్యల్లో భాగంగా తప్పుడు కేసులు పెడుతున్నారని, అందువల్లే నేరాలు రుజువు కావడం లేదని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఇప్పటికైనా ఈ వైఖరి మానుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

దేశంలో ఎంపాక్స్ తొలి కేసు?..

- భయాందోళన వద్దన్న కేంద్రం

న్యూఢిల్లీ: ప్రపంచాన్ని భయపెడుతున్న మంకీపాక్స్ (ఎంపిఒపాక్స్) తొలి కేసు దేశంలో నమోదైనట్టు తెలుస్తున్నది. ఈ వైరస్ లక్షణాలున్న వ్యక్తికి ఎంపాక్స్ సోకినట్టు అనుమానిస్తున్నారు. ప్రత్యేక ఆస్పత్రిలోని ఐసోలేషన్‌లో అతడ్ని ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఆ వ్యక్తి నుంచి సేకరించిన నమూనాలను పరీక్షకు పంపినట్టు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ప్రజలు ఎలాంటి భయాందోళన చెందవద్దని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఎంపాక్స్ వైరస్‌తో పోరాడుతున్న దేశం నుంచి ఇటీవల భారత్‌కు తిరిగి వచ్చిన యువకుడ్ని అనుమానిత కేసుగా గుర్తించినట్టు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదివారం తెలిపింది. ఆ రోగిని ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నట్టు చెప్పింది. అతడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు పేర్కొంది. ఆ వ్యక్తికి ఎంపాక్స్ సోకిందా లేదా అన్నది నిర్ధారించేందుకు అతడి నమూనాలను పరీక్ష కోసం పంపినట్టు వెల్లడించింది.

టిఎంసికి షాక్..

- రాజ్యసభ సభ్యుడు రాజీనామా

కోల్‌కతా : తృణమూల్ కాంగ్రెస్‌కు మరో షాక్ తగిలింది. రాజ్యసభ సభ్యుడు జవహర్ సిర్కార్ ఆదివారం పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆర్‌జి కర్ మెడికల్ కాలేజీ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య, ఆస్పత్రిలో జరిగిన అవినీతికి సంబంధించి తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు టిఎంసి పార్టీ చైర్‌పర్సన్, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. "ఆర్‌జి కర్ ఆస్పత్రిలో ఘోరమైన ఘటనపై తీవ్రంగా బాధపడ్డాను, ఓపిగ్గా నెలరోజులపాటు ఎదురు చూశాను. జూనియర్ డాక్టర్ల సమస్యపై ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంటారని ఆశించాను. కానీ, అది జరగలేదు. ప్రభుత్వం ఇప్పుడు చాలా ఆలస్యంగా అరకొర చర్యలు తీసుకుంటుంది. పార్లమెంట్‌లో బెంగాల్ సమస్యలు ప్రస్తావించేందుకు నాకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు. నేను ఇక ఎంపీగా కొనసాగలేను. అవినీతి, మతతత్వం, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల్లో నియంతృత్వంపై పోరాడటంలో ఏమాత్రం రాజీలేదు" అని జవహర్ తన లేఖలో పేర్కొన్నారు.

జితేంద్ర చౌదరి ఇంటి వద్ద విహెచ్‌పి గూండాల విధ్వంసం

త్రిపుర సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరిపై దాడికి యత్నం

- విహెచ్‌పి గూండాల బరితెగింపు ●సిపిఎం ఆందోళన

అగర్తల : బిజెపి అధికారంలో ఉన్న త్రిపురలో విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పి) గూండాలు మరోసారి రెచ్చిపోయారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత జితేంద్ర చౌదరి ఇంటి వద్ద విహెచ్‌పి గూండాలు వీరంగం వేస్తూ, ఆయనపై దాడికి యత్నించారు. త్రిపుర రాజధాని అగర్తలలో కృష్ణానగర్‌లోని జితేంద్ర చౌదరిపై దాడిని సిపిఎం తీవ్రంగా ఖండించింది. జితేంద్ర చౌదరి నివాసంపై దాడి గురించి తెలియగానే పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకోవడంతో విహెచ్‌పి గూండాలు పరారయ్యారు. ఈ దాడిలో రాష్ట్ర మంత్రి, బిజెపి నాయకుడు సుధాన్షు దాస్ ప్రమేయం ఉన్నట్టు భావిస్తున్నారు సుధాన్షు దాస్ ఇటీవల పెట్టిన ఫేస్‌బుక్ పోస్టు కారణంగా రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో మైనార్టీలపై దాడులు చెలరేగాయని విమర్శించారు. పదుల సంఖ్యలో మైనార్టీల ఇళ్లను తగుల బెట్టారని, ఆటో రిక్షాలతో సహా 13 వాహనాలను దగ్ధం చేశారని తెలిపారు. ఫేస్‌బుక్ పోస్టుపై మంత్రి క్షమాపణలు చెప్పాలని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను జితేంద్ర చౌదరి పట్టుబట్టారు. ఈ నేపథ్యంలోనే ఈ దాడి చోటుచేసుకుంది.

సిపిఎం ఆధ్వర్యాన ఆందోళనలు

జితేంద్ర చౌదరి నివాసంపై దాడిని నిరసిస్తూ త్రిపురలోని పలు ప్రాంతాల్లో సిపిఎం నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహించారు. పశ్చిమ అగర్తల పోలీస్‌స్టేషన్ ముందు సిపిఎం నాయకులు, మాజీ మంత్రి మాణిక్ దేవ్, లోక్‌సభ మాజీ సభ్యులు శంకర్ ప్రసాద్ దత్తా, రాజ్యసభ మాజీ ఎంపి, లెఫ్ట్ ఫ్రంట్ కన్వీనర్ నారాయణ్ కర్, ఇతర నాయకులు ఆందోళనకు దిగారు. రోడ్డును దిగ్బంధించారు. విహెచ్‌పి గూండాలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గోమతి జిల్లా అమర్‌పూర్ వద్ద సిపిఎం కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు.

హర్యానా ఎన్నికల్లో కాంగ్రెస్-ఆప్ పొత్తు ఖరారు !

న్యూఢిల్లీ : హర్యానా అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్-ఆప్ మధ్య పొత్తు ఖరారైనట్లు సమాచారం. శని, ఆదివారాల్లో రెండు పార్టీల నాయకుల మధ్య జరిగిన వరుస సమావేశాల్లో సీట్ల సంఖ్యపై విభేదాలు తొలగినట్లు సమాచారం. ఆప్‌కు ఐదు నుంచి ఆరు సీట్లను కేటాయించినట్లు తెలుస్తోంది. ఆదివారం అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని గతంలో ఆప్ ప్రకటించినా అలా జరగలేదు. సోమవారం రెండు పార్టీల మధ్య పొత్తును అధికారంగా ప్రకటించే అవకాశం ఉంది. ఆదివారం తొమ్మది మంది అభ్యర్థులతో కాంగ్రెస్ రెండో జాబితాను ప్రకటించింది. 32 మంది అభ్యర్థులతో ఈ నెల 6న తొలి జాబితాను ప్రకటించిన సంగతి తెలిసిందే.

నెతన్యాహు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మరోసారి నిరసనల వెల్లువ

టెల్‌అవీవ్: నెతన్యాహు ప్రభుత్వ యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా ఇజ్రాయిల్‌లో తాజాగా ఉవ్వెత్తున నిరసనలు ఎగసిపడ్డాయి. టెల్ అవీవ్‌లో ఆదివారం అయిదు లక్షలమందితో భారీ నిరసన ర్యాలీ జరిగింది. గాజాలో కాల్పుల విమరణ ప్రకటించాలని, అక్టోబరు 7 న పాలస్తీనా సాయుధ పోరాట సంస్థ హమాస్ చెరలో బందీలుగా ఉన్న ఇజ్రాయిలీయుల విడుదలకు ఒప్పందం కుదుర్చుకోవాలని నిరసనకారుల నినాదాలతో టెల్ అవీవ వీధులు మార్మోగాయి. కాల్పుల విరమణ, శాంతి పునరుద్ధరణకు జరిగిన యత్నాలను నెతన్యాహు తిరస్కరించడం, ఇజ్రాయిల్ దాడుల్లో హమాస్ వద్ద ఉన్న బందీల్లో కొందరు చనిపోవడం వంటి పరిణామాల నేపథ్యంలో ప్రధాని తప్పుకోవాలంటూ ఇజ్రాయిలీ కార్మిక వర్గం గత వారం దేశ వ్యాపిత సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. ఇది జరిగిన కొద్ది రోజులకే టెల్ అవీవ్‌లోను, జెరూసలెం, హైఫా, బీ ఎర్ షెవా తదితర పట్టణాల్లోను, కేసరియాలోని ప్రధాని ప్రైవేట్ నివాసానికి సమీపంలోను పెద్దయెత్తున ప్రజలు గుమి కూడి నిరసనలు తెలిపారు. ఈ నిరసనల్లో హమాస్ వద్ద బందీలుగా ఉన్న ఇజ్రాయిలీయుల కుటుంబ సభ్యులు, మాజీ సైనిక ప్రధానాధికారి, నెతన్యాహు ప్రభుత్వంలో రక్షణ మంత్రి కూడా అయిన మోషే యాలోన్ కూడా పాల్గొనడం విశేషం.

12వ నెలలోకి ఇజ్రాయిల్ మారణకాండ

- శాంతి పునరుద్ధరణకు మోకాలడ్డుతున్న నెతన్యాహు

గాజా సిటీ: గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణ హోమానికి ఈ నెల7 వతేదీతో పదకొండు మాసాలు పూర్తయ్యాయి. దాడులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. శాంతి నెలకొనే సూచనలు కనుచూపు మేరలో ఎక్కడా కానరవాడం లేదు. ఇజ్రాయిల్ జైళ్లలో ఉన్న పాలస్తీనీయులను, హమాస్ చెరలో ఉన్న ఇజ్రాయిలీయులను పరస్పరం అప్పగించుకునేందుకు ఉద్దేశించిన ఒప్పందానికి నెతన్యాహు ప్రభుత్వం తిరస్కరించింది గత ఏడాది అక్టోబరు 7కి ముందున్న స్థితిని పునరుద్ధరించేందుకు ఇజ్రాయిల్ దళాలను పూర్తిగా వెనక్కి తీసుకోవాలని హమాస్ డిమాండ్ చేస్తోంది. ఇందుకు ఇజ్రాయిల్ ససేమిరా అంటోంది. గాజా, ఈజిప్టు సరిహద్దు వెంబడి తమ బలగాలు కొనసాగుతాయని చెబుతోంది. ఈజిప్టు, అమెరికా, ఖతార్ మధ్యవర్తిత్వంలో సాగిన శాంతి చర్చలు ఇజ్రాయిల్ మొండి వైఖరి వల్లే నిష్ఫలమయ్యాయి. ఈ పదకొండు మాసాల కాలంలో ఇజ్రాయిల్ మొత్తం 40, 939 మందిని అమానుషంగా పొట్టనబెట్టుకుంది. వీరిలో ఎక్కువ మంది మహిళలు, పిల్లలే. అక్టోబరు7న జరిపిన దాడిలో హమాస్ బందీలుగా పట్టుకున్న 251 మంది ఇజ్రాయిలీయుల్లో 97 మంది ఇప్పటికీ గాజాలో ఉన్నారు. ఇజ్రాయిల్ సైన్యం జరిపిన దాడుల్లో 33 మంది బందీలు చనిపోయారు. ప్రపంచ వ్యాపితంగా, ఇజ్రాయిల్‌లో కార్మికవర్గం, మెజార్టీ ప్రజానీకం నెతన్యాహు రక్తదాహానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నా, నెతన్యాహు ప్రభుత్వం అమెరికా, ఇతర పశ్చిమ దేశాల దన్ను చూసుకుని కాల్పులవిరమణతో సహా శాంతి పునరుద్ధరణకు జరిగే ప్రతి యత్నాన్ని ఏదో ఒక సాకు చూపి అడ్డుకుంటోంది. ఇదిలావుండగా శనివారం గాజాలో ఇజ్రాయిల్ సాగించిన వైమానిక, బాంబు దాడుల్లో 17 మంది దాకా మరణించినట్లు ఎఎఫ్‌పి వార్తా సంస్థ తెలిపింది. బురేజ్ క్యాంపుపై జరిగిన దాడిలో మరో నలుగురు చనిపోయారు. దక్షిణ లెబనాన్‌లో మంటలను ఆర్పుతున్న పౌర రక్షణ సిబ్బందిపై ఇజ్రాయిల్ జరిపిన బాంబు దాడిలో ఇంకో ముగ్గురు చనిపోయారని లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది.

కొత్త ప్రధానికి వ్యతిరేకంగా ఫ్రాన్స్‌లో భారీ నిరసనలు

పారిస్: ఫ్రెంచ్ ప్రజలు ఇచ్చిన తీర్పునకు భిన్నంగా మితవాది మిచెల్ బార్నియర్‌ను నియమించిన అధ్యక్షుడు మాక్రాన్ చర్యను నిరసిస్తూ వామపక్షాలు ఇచ్చిన పిలుపు మేరకు లక్షలాది మందితో శనివారం నాడిక్కడ భారీ ర్యాలీ జరిగింది.పశ్చిమాన నాంటెస్, దక్షిణాన నైస్ , మార్సెయిల్, తనూర్పున స్ట్రాస్‌బర్గ్‌తో సహ దేశంలోని ముఖ్యమైన నగరాలన్నీ నిరసనలతో హోరెత్తాయి. మాక్రాన్ అధికార లూటీని వారు తీవ్రంగా ఖండించారు.జులైలో జరిగిన ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికల్లో వామపక్షాలు, ప్రగతి శీల శక్తులతో కూడిన న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) ఏకైక అతి పెద్ద కూటమిగా అవతరించింది. ఆ కూటమి ప్రతిపాదించిన అభ్యర్థిని పక్కన పెట్టి కేవలం ఆరు శాతం మాత్రమే ఓట్లు వచ్చిన, అతి చిన్న పార్టీకి చెందిన నేత,72 ఏళ్ల మాజీ విదేశాంగ మంత్రి మిచెల్ బార్నియర్‌ను మాక్రాన్ కొత్త ప్రధానిగా గురువారం నియమించిన సంగతి తెలిసిందే.

ప్రధానిగా మితవాది బార్నియర్‌ను నియమించడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వామపక్ష కార్యకర్తలు

ప్రతి అడుగూ ప్రజా మద్దతుతోనే

- వినేష్ ఫొగట్

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

తన ప్రతి అడుగూ ప్రజల మద్దతుతోనే సాగిందని, రాజకీయాల్లోనూ విజయం సాధిస్తానని వినేష్ ఫొగట్ దీమావ్యక్తం చేశారు. ఆదివారం జులనా నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా వినేష్ మాట్లాడుతూ తాను రెజ్లింగ్‌లో ఏది గెలిచినా అది ప్రజల వల్లనే గెలిచానని, రాజకీయాల్లోనూ విజయం సాధిస్తానని ఆశిస్తున్నానని అన్నారు. జంతర్ మంతర్ వద్ద తాము ఆందోళన చేసేలా బిజెపి చేసిందని చెప్పారు. బ్రిజ్ భూషణ్ అంటే దేశం కాదని, తన ప్రతి అడుగులో సొంత ప్రజలే తన వెంట ఉన్నారని తెలిపారు. పారిస్ ఒలంపిక్స్‌లో పతకం రాలేదన్న బాధ భారత్‌లోని ఎయిర్‌పోర్టుకు చేరుకున్న తరువాత తగ్గిందని అన్నారు. ఎన్ని సవాళ్లనైనా ఎదుర్కొంటానని, తాను చేసే ప్రతి యుద్ధంలో విజయం సాధిస్తానని వినేష్ ధీమా వ్యక్తం చేశారు.

ఉత్తరాంధ్రలో కుండపోత

(మొదటిపేజీ తరువాయి)

సింహాచలం ప్రాంతాల్లో వేలాది మంది కొండవాలు ప్రాంతాలు బిక్కుబిక్కుమంటున్నారు. విశాఖ నగరంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

అల్లూరి జిల్లాలో కొట్టుకుపోయిన కల్వర్టులు

అల్లూరి సీతారామరాజు జిల్లాలో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు కల్వర్టులు కొట్టుకుపోవడంతో. గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జికె వీధి మండలం వంచల, దేవరపల్లి పంచాయతీల్లో వాగులు పొంగి పంట పొలాలు నీటి మునిగాయి. వంచల పంచాయతీ చేమగెడ్డ వంతెన కొట్టుకుపోయింది. మారేడుమిల్లి మండలం చావడికోట పంచాయతీ బొడ్లంక గ్రామ సమీపాన ఉన్న పెళ్లి రేవు కాలువ కల్వర్టుపై వరద నీరు పొంగి ప్రవహిస్తుండడంతో ఎగువ ప్రాంత గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. రాజవొమ్మంగి మండలంల జడ్డంగి, మడేరు, కింద్ర పెద్దేరు, ఒట్టిగడ్డ, గింజర్తి, నెల్లిమెట్ల వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

అనకాపల్లి జిల్లా వడ్డాది వద్ద పెద్దేరు, విజయరామరాజుపేట వద్ద తాచేరు నదులు వర్షపు నీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. తాచేరు వంతెనపై వాహన రాకపోకలను నిలిపివేశారు. అనకాపల్లి మండలం తుమ్మపాల, శంకరం గ్రామాల పరిధిలో వరి పొలాలు నీట మునిగాయి.

జలాశయాల్లోకి భారీగా వరద నీరు

విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లోని నాగావళి, జంఝావతి, వేగావతి, సువర్ణముఖి, గోముఖి, చంపావతి తదితర నదుల్లో నీటి ప్రవాహ ఉధృతి పెరిగింది. తాటిపూడి జలాశయం గేట్లు ఎత్తివేశారు. మడ్డువలస అవుట్ ఫ్లో నీటిని కూడా పెంచారు. విజయనగరం జిల్లాలో 625.8 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. పార్వతీపురం మన్యం జిల్లాలో పాచిపెంటలో కురుస్తున్న వర్షాలకు పత్తి, మొక్క జొన్న పంటలకు నష్టం వాటిల్లింది.

ఏలేరుకు భారీగా వరద

కాకినాడ జిల్లా కాకినాడ, సామర్లకోట, పిఠాపురం, గొల్లప్రోలు, ఏలేశ్వరం, జగ్గంపేట మండలాల్లో భారీ వర్షం కురిసింది. ఏలేశ్వరంలో ఏలేరు రిజర్వాయర్‌కు భారీగా వరద నీరు చేరుతుండడంతో అధికారులు ప్రాజెక్టు దిగువనగల గ్రామాలను అప్రమత్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా, కోనసీమ జిల్లాలో తెల్లవారుజాము నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తూనే ఉంది. గుంటూరు, పల్నాడు ఒక మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. పొలాల్లో నీరు కదలడం లేదు. దీంతో, పంటలు మునిగి రైతులు ఆందోళన చెందుతున్నారు.

వ్యాన్ డ్రైవర్, క్లీనర్‌ను కాపాడిన స్థానికులు

శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం బెజ్జిపురం, బుడతవలస మధ్యలో ఉన్న చిట్టిగెడ్డ కాజ్‌వే నుంచి వెళ్తున్న లగేజీ వ్యాన్ నీటి ఉధృతికి చిక్కుకుపోయింది. స్థానికులు ట్రాక్టర్ సహాయంతో వ్యానుకు తాడు కట్టి లాగుతున్న సమయంలో తాడు తెగిపోవడంతో నీటి ప్రవాహానికి వ్యాను కొట్టుకుపోయి బోల్తా పడింది. స్థానికులు అప్రమత్తమై ఈ వ్యాన్‌లోని డ్రైవర్ కె.వాసు, క్లీనర్ బి.అప్పలరాజులను కాపాడారు.

ఆరని మణిపూర్ మంటలు

- 400 రోజుల్లో మృతులు 230కి పైనే
- 67 వేల మందికి పైగా నిరాశ్రయులు

ఇంఫాల్ : నాలుగు వందల రోజులైనా మణిపూర్‌లో హింసాగ్ని ఇంకా రగులుతూనే ఉంది. గత ఏడాది మే 3న ప్రారంభమైన హింసాకాండకు ఇంతవరకు 230 మందికి పైగా బలయ్యారు. 67 వేల మంది సర్వస్వం కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఈ నెల 1వ తేదీ నుంచి ఇప్పటివరకూ కుకీలపై జరిగిన హింసాత్మక దాడుల్లో తొమ్మిది మంది చనిపోయారు .

మెయితీ కమ్యూనిటీకి ఎస్‌టి హోదా కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ 2023 మే 3న ఆల్ ట్రైబల్ స్టూడెంట్ యూనియన్ మణిపూర్ (ఎటిఎస్‌యుఎం) పిలుపుమేరకు ఇంఫాల్‌లో గిరిజనులకు మద్దతుగా నిర్వహించిన ర్యాలీలో వేలాది మంది పాల్గొన్నారు. దీనికి పోటీగా మెయితీకి చెందిన కొన్ని సంస్థలు మరొక ర్యాలీని నిర్వహించాయి. ఈ సందర్భంగా కొన్ని వాహనాలకు నిప్పు పెట్టారు. కొంతమంది దుండగులు ఆంగ్లో - కుకి యుద్ధ శతాబ్ది ద్వారాన్ని దగ్ధం చేయడంతో పరిస్థితి దిగజారింది. ఆ తరువాత రోజుల్లో... ఇళ్లతో పాటు చర్చిలు, ఆలయాలు, వాహనాలను తగులబెట్టారు. మే 8 నాటికే 60 మంది దాకా మరణించారని, 231 మంది గాయపడ్డారని, మతపరమైన ప్రదేశాలతోపాటు 1,700 ఇళ్లు ధ్వంసమయ్యాయని ముఖ్యమంత్రి ఎన్ బీరేన్‌సింగ్ తెలిపారు. హింసాకాండ కారణంగా వేలాది మంది పౌరులు తమ ఇళ్లను ఖాళీ చేయాల్సి వచ్చింది. మే 5 నాటికి 20 వేల మంది, మే 14 నాటికి 40 వేల మంది ఇళ్లను ఖాళీ చేసి 178 శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నట్లు అధికారిక గణాంకాలే చెబుతున్నాయి. హింసాకాండ దరిమిలా ఎనిమిది జిల్లాల్లో కర్ఫ్యూ విధించిన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. కేంద్ర బలగాలను, సైన్యాన్ని రాష్ట్రంలో మోహరించారు. అయినా హింసాకాండ రోజురోజుకూ తీవ్రతరమవుతూనే ఉంది. జూన్ 14న రాష్ట్ర క్యాబినెట్‌లో ఏకైక మహిళా మంత్రి నెమ్చా కిప్‌జెన్ అధికార నివాసంపై దాడి చేసి నివాసాన్ని తగులబెట్టారు. ఇతర ప్రాంతాల్లోనూ దాడులు పెరిగాయి. ఈ దాడుల్లో

అధునాతన ఆయుధాలు వినియోగించడంపై సర్వత్రా ఆందోళన నెలకొంది. గత ఏడాది మే 4 నుంచి 29 మధ్య పోలీసుల నుంచి సుమారు మూడు వేల ఆయుధాలను ఆందోళనకారులు దోచుకున్నారు. వీటితోపాటు అనేక అధునిక ఆయుధాలను కూడా ఆందోళనకారులు బహిరంగంగా ప్రదర్శించడం, సోషల్ మీడియాలో పోస్టులు చేయడంతో దేశం నివ్వెరపోయింది. కొంతమంది వ్యక్తులు వీధుల్లో ఆయుధాలు, యూనిఫారాలతో కవాతు చేయడం, ఇళ్లపై దాడులు చేస్తున్న వీడియోలు దేశాన్ని కుదిపేశాయి. కొన్ని ఇళ్లపైనే కాకుండా కాలనీలు, ఊర్లకు ఊర్లను తగులబెట్టడం మణిపూర్‌లో సామాన్య విషయంగా మారిపోయింది. కుకీలు అధికంగా నివసించే ప్రాంతాలు అధికంగా దాడులకు గురయ్యాయి. ఇద్దరు మహిళలను నడి రోడ్డుపై నగ్నంగా నడిపించిన దృశ్యాలు దేశానికే తలవంపులు తెచ్చాయి. బీహార్, హర్యానా, నాగాలాండ్ నుంచి వచ్చిన వలస కార్మికుల ఇళ్లపైనా దాడులు జరిగాయి. మణిపూర్‌లో ఇంత పెద్దయెత్తున హింసాకాండ జరుగుతున్నా కేంద్ర ప్రభుత్వం నుంచి సరైన స్పందన లేదు. బాధితులను పరామర్శించేందుకు ఒక్కసారి కూడా ప్రధాని నరేంద్రమోడీ ఆ ప్రాంతాన్ని పర్యటించలేదు. పార్లమెంటులోనూ నోరు విప్పలేదు.

ఆరుగురు మృతి

జిరిబామ్ జిల్లాలో తాజాగా చెలరేగిన హింసాకాండలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. శనివారం ఉదయం ఓ వ్యక్తిని నిద్రలో ఉండగానే కాల్చి చంపారు. ఇరు పక్షాల కాల్పుల్లో మరో ఐదుగురు సాయుధులు ప్రాణాలు కోల్పోయినట్టు మణిపూర్ పోలీసులు పేర్కొన్నారు. చూర్‌చాంద్‌పుర్‌లోని మువాల్‌సంగ్, లైకా మువాల్సు గ్రామాల్లో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి మూడు బంకర్లను పోలీసులు కూల్చేశారు. బిష్ణుపుర్ జిల్లా లోయలోని గ్రామాల్లో డ్రోన్ల సహాయంతో బాంబు, రాకెట్ దాడులు ఇక్కడి నుంచే నిర్వహించినట్లు తెలుస్తోంది. రాకెట్ దాడుల్లో ఓ వద్ధుడు ప్రాణాలు కోల్పోగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడిన సంగతి తెలిసిందే.

గవర్నరును కలిసిన సిఎం

హింసాకాండ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎన్. బీరెన్‌సింగ్.. పార్టీ ఎమ్మెల్యేలతో సమావేశమయ్యారు. అనంతరం, రాజ్‌భవన్‌కు వెళ్లిన ఆయన.. గవర్నర్ లక్ష్మణ్ ఆచార్యను కలిసి ఏకాంతంగా మాట్లాడారు.

దేశం విడిచి పారిపోయిన గొంజాలెజ్

కారకస్: వెనిజులా అధ్యక్ష ఎన్నికల్లో ఓడిపోయిన పచ్చి మితవాది ఎడ్మండో గొంజాలెజ్ దేశం వీడి పారిపోయారు. నిన్నటి వరకు ఎన్నికల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని గగ్గోలు పెడుతూ, ప్రజా తీర్పును అంగీకరించేందుకు నిరాకరించిన ఈ వృద్ధ నేత గత కొంతకాలంగా అరెస్టు నుంచి తప్పించుకుంటూ తిరుగుతున్నారు. గత కొన్ని రోజులుగా వెనిజులాలోని స్పెయిన్ ఎంబసీని ఆశ్రయించి రాజకీయ శరణార్థిగా ఆశ్రయం పొందారు. ఇప్పుడు ఆయన స్పెయిన్‌కు చెందిన ప్రత్యేక విమానంలో ఆ దేశానికి ఉడాయించారు. అమెరికా, ఇతర పశ్చిమ దేశాలకు ఏజెంట్‌గా వ్యవహరించిన గొంజాలెజ్ ఆ దేశాల మద్దతుతో అధ్యక్ష



పదవిని ఏదో ఒక విధంగా చేజిక్కించుకోవచ్చని భావించారు. అవేవీ ఫలించకపోవడంతో చడీ చప్పుడు లేకుండా దేశం వీడి పారిపోయారని స్థానిక మీడియా పేర్కొంది. గొంజాలెజ్ స్వచ్ఛందంగా దేశం విడిచిపెట్టి వెళ్లిపోయినట్లు వెనిజులా విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆయనపై వెనిజులా ప్రాసిక్యూటర్ కార్యాలయం అరెస్టు వారెంట్‌ను జారీ చేయాలని ఇదివరకే కోర్టును అభ్యర్థించింది.

పోస్టల్ మెసెంజర్‌లా ఉండొద్దు

- భారత్‌కు ఉక్రెయిన్ రాయబారి సూచన

న్యూఢిల్లీ : రష్యా -ఉక్రెయిన్ సంఘర్షణల సమయంలో భారత్ వీలైనంత వరకూ శాంతి స్థాపనకు కృషి చేయాలని దేశంలోని ఉక్రెయిన్ రాయబారి ఒలెక్సాండర్ పోలిష్‌చుక్ పేర్కొన్నారు. ఆదివారం ఒక మీడియాకు సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'భారతదేశం వంటి పెద్ద ప్రజాస్వామ్య దేశం కేవలం ఒక మెసెంజర్ లేదా పోస్టాఫీసుగా ఉండకూడదు, సంఘర్షణల సమయంలో ఒక దేశం నుండి మరొక దేశానికి సందేశాలను చేరవేయడానికే పరిమితం కాకూడదు. ఇరువైపులా మాట్లాడగలిగే సామర్థ్యంతో పెద్ద పాత్ర పోషించాలి. శాంతి శిఖరాగ్ర సమావేశాలకు ఆతిధ్యం ఇవ్వాలి' అని అన్నారు. స్విస్ శాంతి శిఖరాగ్ర పత్రంపై భారత్ సంతకం చేయాలని ఉక్రెయిన్ కోరుకుంటున్నట్లు ఆయన చెప్పారు.

బిజెపిని గద్దెదించాలి

(మొదటిపేజీ తరువాయి)

గ్రామ సర్పంచిలు... ఇలా ప్రతి రంగంపైనా బిజెపి నేతృత్వంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాడి చేస్తున్నాయి. అన్ని పంటలకు ఎంఎస్‌పి కల్పించేలా చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని, వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని, కార్మికుల కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని, పర్మినెంట్ ఉద్యోగాల నియామకం, స్కీమ్ వర్కర్లతో సహా తాత్కాలిక ఉద్యోగుల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని, రోజువారీ వేతనం రూ.600తో 200 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరించాలని, భారతీయ న్యాయ సంహిత (బిఎన్‌ఎస్)లో ప్రజా వ్యతిరేక నిబంధనల రద్దు చేయాలని, కార్మిక - రైతు ఉద్యమాలపై అణచివేత చర్యలు ఆపాలని మహా పంచాయత్ డిమాండ్ చేసింది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వీటిని సమర్ధవంతంగా లేవనెత్తాలని నిర్ణయించింది.

17న గ్రామాలు, పట్టణాల్లో కిసాన్, మజ్దూర్ సభలు

బిజెపిని ఓడించేందుకు ఈ నెల 17న హర్యానాలోని అన్ని గ్రామాలు, పట్టణాల్లో కిసాన్, మజ్దూర్ పంచాయత్‌లను నిర్వహించాలని, ఆ తరువాత ఇంటింటి ప్రచారం నిర్వహించాలని తీర్మానించింది. ఈ నెల 28న షహీద్ భగత్ సింగ్ జయంతిని కార్పొరేట్, సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా జరుపుకోవాలని, ఆ రోజున సదస్సులు, సాయంత్రం కాగడా ప్రదర్శన నిర్వహించాలని పిలుపునిచ్చింది. గో సంరక్షణ పేరుతో మైనారిటీలు, సామాన్యులపై హింసాత్మక హత్యాకాండకు పాల్పడుతున్న గో గూండాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ కిరాతకులకు రాష్ట్రప్రభుత్వం అండగా నిలుస్తోందని విమర్శించింది. మహాపంచాయత్‌కు అఖిల భారత కిసాన్ సభ, సిఐటియు, బికెయు ఏక్తా ఉగ్ర, పగ్డి సంభాల్ జట్టా, కిసాన్ సభ (అజయ్ భవన్), బికెయు (టికాయత్), ఐఎన్‌టియుసి, బికెయు ఘాసి రామ్ నైన్, ఎఐటియుసి, సర్వ కర్మచారి సంఘ్, భారతీయ కిసాన్ సంఘర్ష్ సమితి, రాష్ట్రీయ కిసాన్ మంచ్, హర్యానా కిసాన్ మంచ్, భారతీయ కిసాన్ కామ్‌ఘర్ అధికార మోర్చా, కిసాన్ మహాసభ, ఎఐకెకెఎంఎస్, రూరల్ లేబర్ అసెంబ్లీ, ఆల్ ఇండియా ఫార్మ్ లేబర్ యూనియన్, రివల్యూషనరీ ఫార్మర్స్ యూనియన్, ఎఐయుటియుసి, మైనారిటీ సంక్షేమ సంఘంతోపాటు ఇతర సంఘాలు హాజరయ్యాయి.

గుడ్ మార్నింగ్ ఇండియా



రాము నాల్గవ తరగతి చదువుకుంటున్నాడు. ఓ రోజు రాము మామయ్య అమెరికాలో ఉండే తన తమ్మునితో వీడియోలో మాట్లాడుతూ, 'గుడ్ ఈవెనింగ్' అంటూ పలకరించడం, ఆయన తమ్ముడు 'గుడ్ మార్నింగ్ అన్నయ్యా' అనడం కూడా చూశాడు. ఆ తర్వాత రాము మామయ్యతో 'మామయ్యా! ఎవరైనా మనల్ని 'గుడ్ ఈవెనింగ్' అని పలకరిస్తే మనం తిరిగి 'గుడ్ ఈవెనింగ్' అనాలన్నావు కదా! మరి నువ్వు 'గుడ్ ఈవెనింగ్' అంటే, చిన మామయ్య 'గుడ్ మార్నింగ్' అని ఎందుకు అన్నాడు?' అని ప్రశ్నించాడు.

'గుడ్, రామూ మంచి ప్రశ్న వేసావు. ఇప్పుడు మన ఇండియాలో ఉదయం ఆరున్నర అయింది. అమెరికాలోని వాషింగ్టన్ డిసిలో ఇప్పుడు సాయంత్రం నాలుగు అయింది. అందువల్ల నేను 'గుడ్ ఈవెనింగ్' అంటే, చిన మావయ్య 'గుడ్ మార్నింగ్' అన్నాడు. అప్పుడు రాము మామయ్యతో 'ఈ లెక్కన అక్కడికీ ఇక్కడికీ తొమ్మిదిన్నర గంటల వ్యత్యాసం ఉంది కదా! రెండు దేశాల మధ్య ఒకే సమయంలో అలా ఎందుకు వచ్చింది?' అంటూ ప్రశ్నించాడు. అప్పుడు మామయ్య రాముతో 'ఏ విషయాలైనా, ఇలా ప్రశ్నిస్తేనే తెలుస్తాయి. మన భూమి గుండ్రంగా ఉండి, పడమర నుండి తూర్పుకు తిరుగుతూ ఉంటుంటుందని నీకు తెలుసు కదా! భూమి తన చుట్టూ తాను తిరిగేటప్పుడు సూర్యుని కాంతి పడే ప్రాంతం పగలుగా, పడని వ్యతిరేక ప్రాంతాన్ని రాత్రిగా అంటారు. అందువల్లే కాలంలో వ్యత్యాసాలు వస్తున్నాయి' అన్నాడు. అప్పుడు రాము 'మామయ్యా, సమయం కనుక్కోడానికి ఇంగ్లాండులోని గ్రీనిచ్ ఆధారంగా 'సున్నా డిగ్రీలు రేఖాంశం' నుండి లెక్క పెడతారని మా మాస్టారు చెప్పారు' అన్నాడు. అప్పుడు మామయ్య 'ఔన్రా రామూ, గ్రీనిచ్ రేఖాంశానికి ముందున్న ఇండియా ఐదున్నర గంటలు, దానికి వెనకున్న అమెరికా నాలుగు గంటలు, మొత్తం తొమ్మిదన్నర గంటల తేడా రెండు దేశాలకు వచ్చింది. అందుకే ఈ 'గుడ్ మార్నింగూ', 'గుడ్ ఈవెనింగ్' అన్నాడు నవ్వుతూ.

'హమ్మయ్యా, ఇప్పుడర్థం అయింది. 'గుడ్ డే' మామయ్యా' అంటూ రాము హోమ్ వర్క్ మొదలు పెట్టాడు.

- వి.వి.సత్యనారాయణ,
92941 02501

సరిచేసి రాయండి

పిల్లలూ, ఇక్కడ గజిబిజిగా ఉన్న అక్షరాలను సరైన క్రమంలో రాస్తే, అర్థవంతమైన పదాలు వస్తాయి. ట్రై చేయండి.

నాకుడువియ
త్సవంఉ
సంర్పఅతన్నణ
దిరిపం
కడువే

నవాలుదలువర
రబుదపుముం
వాలుగుకలువం
పంపొలులాట
వాప్రహం

నేను గీసిన బొమ్మ

యక్షిత్ కుమార్,
9వ తరగతి,
శ్రీనిధి స్కూల్,
తిరువూరు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నవదీప్ పసిడి త్రో

- 200మీ రేసులో సిమ్రన్‌కు కాంస్యం
- పారిస్ 2024 పారాలింపిక్స్

పారిస్ : 2024 పారాలింపిక్స్‌లో భారత జోరు కొనసాగుతుంది. పోటీల చివరి రోజు సైతం భారత పారా అథ్లెట్లు పతక వేటలో అసమాన ప్రదర్శన చేశారు. జావెలిన్ త్రోలో నవదీప్ సింగ్ బంగారు పతకం గెల్చుకోగా.. 200 మీటర్ల పరుగు పందెంలో సిమ్రన్ శర్మ కాంస్య పతకం సొంతం చేసుకుంది. పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ ఇప్పటివరకు 29 పతకాలు సొంతం చేసుకుని.. పారాలింపిక్స్ చరిత్రలోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. నవదీప్.. సూపర్ త్రో : 2020 టోక్యో పారాలింపిక్స్ నవదీప్ సింగ్‌కు తీరని వ్యథ మిగిల్చింది. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్41 విభాగంలో నవదీప్ సింగ్ నాల్గో స్థానంలో నిలిచాడు. కాంస్య పతకం సాధించిన ఇరాక్ పారా అథ్లెట్ విల్డన్ 41.39 మీటర్ల త్రోతో మూడో స్థానంలో నిలువగా.. 40.80 మీటర్ల త్రోతో నవదీప్ సింగ్ నాల్గో స్థానంలో నిలిచాడు. సెంటమీటర్ల వ్యత్యాసంతో పారాలింపిక్స్ పతకానికి దూరమయ్యాడు. మూడేండ్ల తర్వాత పారిస్ పారాలింపిక్స్‌లో కథ మార్చివేశాడు నవదీప్. టోక్యోలో జరిగిన దానికి పూర్తి భిన్నంగా పారిస్‌లో జరిగింది. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్41 విభాగంలో నవదీప్ సింగ్ నిజానికి రెండో స్థానంలో నిలిచాడు. 47.32 మీటర్ల త్రోతో సిల్వర్ మెడల్ సొంతం చేసుకున్నాడు. కానీ ఇరాన్‌కు చెందిన పారా అథ్లెట్ 47.64 మీటర్ల దూరంతో బంగారు పతకం సాధించాడు. కానీ పసిడి సాధించిన ఆనందంలో అతడు పారాలింపిక్స్ క్రీడల నిబంధనలకు విరుద్ధంగా గుర్తింపు లేని రాజ్యం జాతీయ పతాకం ప్రదర్శించటంతో అతడిపై అనర్హత వేటు వేశారు. దీంతో రెండో స్థానంలో నిలిచిన నవదీప్ సింగ్‌కు బంగారు పతకం దక్కింది. డిఫెండింగ్ చాంపియన్, చైనా పారా అథ్లెట్ సన్ కాంస్య పతకాన్ని సిల్వర్ మెడల్ చేసుకోగా.. నాల్గో స్థానంలో నిలిచిన నుకుల్‌వాయ్ కాంస్య పతకం సాధించాడు. 23 ఏండ్ల నవదీప్ సింగ్ తొలినాళ్లలో జావెలిన్‌పై మక్కువ చూపించలేదు. తండ్రి దల్బీర్ సింగ్ బాటలోనే నడిచి రెజ్లింగ్‌లో సాధన చేశాడు. జాతీయ స్థాయిలో కొన్ని టోర్నమెంట్లలోనూ పోటీపడ్డాడు. కానీ మరో పారా జావెలిన్ త్రోయర్ సందీప్ చౌదరిని చూసి స్ఫూర్తి పొందిన నవదీప్ సింగ్ జావెలిన్ త్రోను కెరీర్‌గా ఎంచుకున్నాడు. నాలుగు అడుగుల నవదీప్ సింగ్‌కు ఆరంభంలో ఏడు అడుగుల జావెలియన్‌ను పట్టుకోవటం కాస్త ఇబ్బందిగా ఉండేది. కానీ ఒక్కసారి సాధన షురూ చేశాక ఎక్కడా వెనక్కి తగ్గలేదు. 2024 పారిస్ పారాలింపిక్స్‌లో ఏకంగా పసిడి పతకంతో సరికొత్త చరిత్ర సృష్టించాడు.

సిమ్రన్.. కాంస్య పరుగు : ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో భారత్‌కు మరో మెడల్ లభించింది. మహిళల 200 మీటర్ల టీ12 విభాగం ఫైనల్లో సిమ్రన్ శర్మ కాంస్య పతకం సాధించింది. ఈ విభాగంలో వరల్డ్ చాంపియన్‌గా పతక వేటకు బరిలోకి దిగిన సిమ్రన్ శర్మ.. తొలి ప్రయత్నంలోనే పారాలింపిక్స్ పతకం సొంతం చేసుకుంది. 100 మీటర్ల టీ12 విభాగం ఫైనల్లో నాల్గో స్థానంలో నిలిచి 0.05 సెకండ్ల తేడాతో పతకం చేజార్చుకున్న సిమ్రన్ శర్మ.. 200 మీటర్ల విభాగంలో మెడల్ పోడియంపై నిలిచింది. 24.75 సెకండ్లలో రేసును పూర్తి చేసిన సిమ్రన్ శర్మ..భారత పతకాల సంఖ్యను 29కు మెరుగుపర్చింది. క్యూబా పారా స్ప్రింటర్ ఓమర 23.62 సెకండ్లతో బంగారు పతకం గెల్చుకుంది. వెనుజులా పారా స్ప్రింటర్ లోపెజ్ సిల్వర్ మెడల్ సాధించింది.

ఛాంపియన్ సబలెంకా

- యు.ఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



న్యూయార్క్ : మహిళల సింగిల్స్ టైటిల్‌ను రెండో సీడ్ బెలారస్ స్టార్ అర్యాన సబలెంకా సొంతం చేసుకుంది. సుమారు రెండు గంటల పాటు సాగిన ఉత్కంఠభరిత టైటిల్ పోరులో సబలెంకా కెరీర్‌లోనే అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. ఆరో సీడ్ అమెరికా అమ్మాయి జెస్సికా పెగులాపై 7-5, 7-5తో వరుస సెట్లలో విజయం సాధించింది. తొలిసారి యు.ఎస్ ఓపెన్ మహిళల సింగిల్స్ కిరీటం దక్కించుకుంది. సబలెంకా కెరీర్‌లో ఇది మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ విజయం కాగా.. ఈ సీజన్‌లోనే రెండోది. ఈ ఏడాది ఆరంభంలో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ సాధించిన సబలెంకా టెన్నిస్ ఓపెన్ చరిత్రలో ఓ సీజన్‌లో రెండు హార్డ్‌కోర్టు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు (ఆస్ట్రేలియన్, యు.ఎస్ ఓపెన్) సాధించిన ఐదో క్రీడాకారిణిగా నిలిచింది.

వైద్యో నారాయణో హరి అన్న నానుడికి నిలువెత్తు నిదర్శనం డాక్టర్ అంబుల మనోజ్, డాక్టర్ వైష్ణవి. దీనజనుల సేవే లక్ష్యంగా గత 32 సంవత్సరాలుగా వైద్యవృత్తిలో రాణిస్తున్నారు మనోజ్. తండ్రి కలలకు ప్రతిరూపంగా నిలిచిన తనయ వైష్ణవి. తమ సేవాదృక్పథంతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలవాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటివరకూ రూ.50 లక్షల వరకూ వివిధ రూపాల్లో సేవా కార్యక్రమాలు, విరాళాల రూపంలో అందజేశారు. కోవిడ్ కష్ట సమయంలో పేదల ఆకలిని తీర్చడానిక తమవంతుగా ఆహార పొట్లాలు, మందుల కిట్లను పంపిణీచేశారు.

ఆపన్నులకు అండగా తండ్రీ, తనయ

ఏలూరు జిల్లా ముదినేపల్లికి చెందిన డాక్టర్ అంబుల మనోజ్ ఆ పరిసర ప్రాంతాల్లో 'ఆపద్బాంధవుడు'గా పేరుగాంచారు. పల్లె వైద్యుడిగా నిరుపేదలకు తన శక్తిమేరకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. అంతేకాక, అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయిన వారికి రూ.5000 ఆర్థిక సహాయం, రూ.2000 విలువైన నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. కరోనా సమయంలో అనాథ భౌతిక కాయాలకు దహన సంస్కారాలు జరిగేలా ఏర్పాటుచేశారు. క్యాన్సర్, టీవీ పేషెంట్లకు ఆర్థిక సాయం అందించారు. పేదల భౌతిక కాయాల దహనం నిమిత్తం నిరంతరం రూ.5000 చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నారు.

రెండు పాఠశాలలు, ఒక కళాశాల దత్తత

పెయ్యేరు పంచాయతీ శివారు రంగాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్, ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలను దత్తత తీసుకుని రూ.10 లక్షలతో ఆధునీకరించారు. మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించారు. సరికొత్తగా రంగులు వేయించి చూడముచ్చటగా తీర్చిదిద్దారు. ఆవరణలో మొక్కలు నాటించారు. వాటి రక్షణ కోసం ట్రీ గార్డులు ఏర్పాటు చేయించారు. 12 బెంచీలు, 12 డెస్కులు, డిజిటల్ క్లాస్ రూమ్‌కు ప్రొజెక్టర్‌ను కూడా సమకూర్చారు. మంచినీటి బోరు, ఇంకుడు గుంత నిర్మాణం, వంటశాల నిర్మాణాలు చేపట్టారు. సరిపడా ఆట వస్తువులు సమకూర్చారు. ముదినేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రెండు మంచినీటి బోర్లు వేయించారు. మంచి నీటి ట్యాంక్ నిర్మించారు. 50 మొక్కలకు ట్రీగార్డులు ఏర్పాటు చేయించారు. శిథిలావస్థకు చేరుకున్న పాఠశాల భవనానికి మరమ్మతులు చేయించారు. రెండు ఇంకుడు గుంతలను కూడా నిర్మించారు. ముదినేపల్లి జూనియర్ కళాశాలను దత్తత తీసుకుని కాంపౌండ్ వాల్‌కు రంగులు వేయించారు. రెండు మంచినీటి బోర్లు ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటించారు. జాతీయ నాయకుల నినాదాలను గోడలపై రాయించారు. అప్పటి కలెక్టర్ లక్ష్మీకాంతం స్ఫూర్తితో 400 మొక్కలు నాటి ట్రీ గార్డులు ఏర్పాటుచేయించారు.

పర్యావరణం- పరిశుభ్రతపై అవగాహన

పర్యావరణ పరిరక్షణ కోసం 'చెట్లు పెంచాలి-అడవులను కాపాడాలి, 'మొక్కలను పెంచండి-ప్రకృతిని కాపాడండి' అనే నినాదాలతో కైకలూరు, గుడివాడ నియోజకవర్గాల పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, తుపాన్లు, వరదలు వంటి విపత్కర పరిస్థితుల్లో బాధితులకు అండగా నిలిచేందుకు పలు సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటుగా పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యతను గుర్తుచేస్తూ పలు మండలాల్లో అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. స్వచ్ఛభారత్‌పైనా అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. 'సుజలాం- [illegible], [illegible]' కార్యక్రమాల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సొంత ఖర్చులతో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయించారు.

పేదలకు ఆర్థిక సాయం

ఇలాంటి సేవాదృక్పథం డాక్టర్ మనోజ్ దంపతుల ఏకైక కుమార్తె వైష్ణవి. తను కూడా తండ్రి వలె మొదటినుంచీ సేవాదృక్పథంతో వైద్యవిద్య పట్ల ఆసక్తిని పెంచుకొంది. మన అమరావతి అభివృద్ధికి తన పాకెట్ మనీ రూ.లక్ష విరాళం అందించారు. అప్పటి కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. అమరావతి అంబాసిడర్‌గా నియమితులయ్యారు. 'మన పాకెట్ మనీతో పాఠశాలలను తీర్చిదిద్దుకుందాం' అనే నినాదంతో ప్రచారం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా కడప ఉక్కు ఫ్యాక్టరీ, అమరావతి స్తూపం, హైకోర్టు నిర్మాణానికి రూ.లక్ష చొప్పున రూ.3 లక్షలు, పోలవరం నిర్మాణానికి రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. మొత్తంగా రాజధాని ప్రాజెక్టుల నిమిత్తం రూ.10 లక్షలు ఇచ్చారు. రాష్ట్ర విభజన సమయంలో సమైక్యాంధ్ర ఉద్యమంలో ఆమె పాల్గొన్నారు. తండ్రి తనకోసం డిపాజిట్ చేసిన రూ.లక్షను నవ్యాంధ్ర రాజధాని నిర్మాణానికి విరాళంగా అందించారు. ఐదో తరగతిలోనే సమైక్యాంధ్ర ఉద్యమంలో భాగంగా 40 రోజులు రిలే నిరాహార దీక్షలు చేశారు. అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి నుంచి అభినందనలు అందుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు 2018లో మొదటిసారి, 2024లో రెండోసారి అంబుల వైష్ణవిని అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు.

పొలం అమ్మి... రాజధానికి విరాళం

అమరావతి రాజధాని నిర్మాణానికి ఇప్పటి వరకూ రూ.35 లక్షలు ఇచ్చారు. తమకున్న మూడు ఎకరాల పొలంలో ఒక ఎకరం, తనకున్న బంగారు గాజులు అమ్మి రూ.25 లక్షలు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా చెక్కు రూపంలో అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన విశ్వగురు వరల్డ్ రికార్డ్ సేవా సంస్థ కామధేను అవార్డును 2024లో అందించింది. తండ్రి బాటలోనే సేవాతత్పరత కొనసాగిస్తున్న వైష్ణవి ఇప్పుడు వైద్యవిద్యార్థిని. త్వరలో వైద్యపట్టా అందుకొని తన సేవలను విస్తృతపరుస్తానని ఆమె అంటున్నారు.

ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకుంటూ

- గొట్టేటి శ్రీనివాసులు,
కాళ్ళ మండల ప్రజాశక్తి విలేకరి,
9397139966

నాన్న మాటలే స్ఫూర్తి

నా తండ్రి ప్రయివేటు ప్రాక్టీషనర్‌గా పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రమాదాల్లో ఎవరైనా చనిపోయినా, గాయపడినా అడక్కుండానే ఆర్థిక సహాయం చేస్తుంటారు. ఆయన స్ఫూర్తితోనే ఐదో తరగతి నుంచే సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నా. ఇప్పటివరకూ రూ.20 లక్షలు వరకూ పేదలకు ఆర్థిక సహాయం చేశా. నాన్న సుమారు రూ.30 లక్షల వరకూ చేశారు. డాక్టరయ్యాక మరింత వైద్య సేవలు అందిస్తా.

- అంబుల వైష్ణవి, వైద్య విద్యార్థిని,

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68